## మూడవ తిరుమొఝి

శ్రీమతే రామానుజాయ నమః

## మూడవ తిరుమొఝి

అవతారిక: గోపస్త్రీలు చెరువుగట్టున తమ పట్టువస్త్రాలని విప్పివేసి మంచునీటిలో స్నానం చేసేటప్పుడు కృష్ణుడు వాళ్ళకి కనబడకుండా వచ్చి వాటిని అపహరించి గట్టుమీదున్న కురున్దవృక్షం ఎక్కి కూచున్నాడు. “పట్టుప్పణియాయ్ – చూస్తుండిరి” అని ఈ తిరుమొఝి విషయం. దీనిని ఎందుకు సాయించేరన్నవిషయం ముందే మేము చెప్పేం. ఇక్కడ కామార్చన చేసిన తరువాత “తొట్టుతైత్తు నలియేల్ కణ్డాయ్” అన్నట్లు వచ్చి ముట్టుకోవటం, ఆ తరువాత “ఎమ్మై ప్పఱ్ఱిమెయ్ప్పిణక్కిట్టక్కాల్ – మమ్ములను పట్టుకొని బంధించి వేస్తే అన్నట్లుగా ఇద్దరూ కూడా రెండు శరీరాలతో ఉండటం కాకుండా ఒకే శరీరమన్నట్లుగా సంశ్లేషం జరిగి, ఆవిధమైన కౌగలింత విశ్లేషం తరువాత ఇంకా భోగ్యంగా ఉంటుంది గనుక విశ్లేషించి తరువాత మళ్ళీ కలిస్తే చక్కగా కలిసి ఉంటారని, తలంచి వీరి బంధువర్గం అంతా “ఈ చిన్నపిల్లలని పోగొట్టుకోలేము, ఇట్లా అయితే ఏమి చెయ్యటం” అని ఆలోచించి, ఈ పిల్లలని చాలాకాలం ఇళ్ళలోనే బంధించేశారు. వాళ్ళుకూడా కృష్ణవిశ్లేషాన్ని సహించలేక, “ఉపవాసకృశాం దీనాం” అని చెప్పినట్లుగా ఆర్తి మూర్తీభవించి ఉన్నట్లు ఉండగా, ఈయనకూడా “న మాంసం రాఘవో భుఙ్క్తే” అనిన్నీ, “నైవ దంశాన్నమశకాన్” రాముడు కుడుతున్నవిగాని, పాకేవిగాని తనశరీరాన్ని బాధిస్తూన్నా వాటిని గుర్తించే స్థితిలో లేడు అని చెప్పినట్లుగా బాహ్యస్మృతి లేకుండానే ఉన్నాడన్నమాట..

దీనికి కారణం ఏమిటి ? అంటే త్వద్గతేనాంతరాత్మనా అని “పరకాయ ప్రవేశం చేసినవాళ్ళకి ఏమైనా తెలుస్తుందా? తమమీద తమకి జ్ఞానం ఉంటే కదా తెలియటానికి” అన్నట్టుగా వీరిద్దరూకూడా ఒకరు “అనిద్రస్సతతం – ఒక్కక్షణంకూడా నిద్రించని”వాడైతే, ఇంకొకరు “ఊర్ధ్వం మాసాన్నజీవిష్యే – ఇక నెలరోజులకంటే ఎక్కువ బతకను” అంటే వీరు “న జీవేయం క్షణమపి – ఒకక్షణకాలం కూడా జీవించను” అన్నట్టుగా పరిస్థితి ఉన్నది.

ఈవిధంగా ఇద్దరికీకూడా విశ్లేషదుఃఖం కట్టలు తెంచుకుంటూండగా ఆడపిల్లల స్థితిని చూస్తున్న తల్లిదండ్రులు “వీళ్ళకి ఏదో దారి చూస్తే తప్ప మరి

బతకరు. మనమే వీళ్ళని అతనికి అప్పగించటం కుదరదు  ఇక ఒక మార్గం ఉన్నది. ఆడపిల్లలకి మంచి భర్త లభించటానికని స్నానవ్రతం అనేఒక వ్రతం చెయ్యటం ఉన్నది. దాన్ని వీళ్ళు చేస్తే వాళ్ళమనసులో ఉన్నదీ జరుగుతుంది, మనకి ఇది తెలిసినట్టూ ఉండదు" అని వాళ్ళలో వాళ్ళు నిశ్చయించుకున్నారు. ఆయనకూడా విశ్లేషించినది మొదలు వీళ్ళ ఎత్తులని తెలుసుకోవటమే పనిగా ఉన్నాడు. అంచేత తాను విశ్లేషించినతరువాత అయిదులక్షల పుట్టిళ్ళకీ వేరువేరుగా మనుషులని పెట్టుకొని  ఊళ్ళోజరుగుతున్న విశేషాలని జరగబోతున్నవాటినీ అన్నింటినీ తెలుసుకొని ఇట్లా స్నానవ్రతం చేయించటానికి సిద్ధమౌతున్నారని విని తానుకూడా తగినట్లుగా సిద్ధపడి ఉన్నాడు.

ఆ పిల్లలుకూడా "ఇతనితో సంశ్లేషమే సహించరానిది. ఆపైన విశ్లేషమంటే మరి వే చెప్పనక్కరలేనిదే. సంశ్లేషం కాస్తా విశ్లేషంగానే చివరికి మిగులుతుంది. అంచేత ఆయనతో సంశ్లేషాన్ని పొంది, తరువాత విశ్లేషబాధని అనుభవించటం కంటే ఇప్పుడున్న ఈ విరహజ్వరం తగ్గటానికి చెరువులో నిండామునిగి దానివల్ల కలిగే శమనంఇప్పటికి చాలు. అలా చెరువులో మునిగేటప్పుడు మనమూ, అతనూఅందరం కలిసి ఇదివరకు వెళ్ళిన చెరువుకే వెళితే అతనికి తెలిసి అక్కడికి వస్తాడు. అందుచేత అతనికి తెలియని చెరువుని వెతికి అక్కడికి వెళ్ళాలి. అప్పుడుకూడా అందరం కలిసి వెళితే అతనికి తెలిసిపోతుంది. కనుక, ఒక్కొక్కళ్ళుగా వెళదాం. వెళ్ళినప్పుడు మన అడుగులు చూసి దారి తెలుసుకోలేకుండా పడిన అడుగులని చెరిపివేసుకుంటూ వెళదాం" అని అందరూ వెళ్ళేరు.

అదే సమయంలో కృష్ణుడుకూడా వీళ్ళని కలుసుకునేందుకు ప్రయత్నించే వాడే కదా వీళ్ళనుకోవడాన్ని తెలుసుకున్నాడు. అయోధ్యలో ఉన్నవాళ్ళలాగ దారి చిహ్నాలు మార్చేస్తే మరి తెలుసుకోలేక తిరిగి వెళిపోయేంత తెలివి తక్కువ వాడు కాడు గదా! ఆనాడు ఆంజనేయస్వామి ఇయేష పదమన్వేష్టుం చారణాచరితే పథి అని బయలుదేరినట్లు బయటుదేరేడు. అయితే ఈయన బయలుదేరి రావటం వాళ్ళకి తెలియదా? అంటే వాళ్ళనే బురిడీ కొట్టించే ఘనుడు కదా ఈయన! "ఇరుళన్నమేని – చీకటివంటి మేని"రంగు గలవాడుగనుక చీకటిలో కలిసిపోయే శరీరం ఈయనది. అందుచేత నీడలాగ నీడవెనక వెళ్ళినట్లు వీళ్ళనీడలోనే ఒదిగిపోయి

వాళ్ళకంటే ముందుగా చెరువుగట్టు చేరుకున్నాడు. వీళ్ళు గొల్లపిల్లలు కదా వాళ్ళ పట్టుబట్టలు, ఆభరణాలు అన్నింటినీ ఒడ్డున వదేసి నీళ్ళల్లో దిగి జలకాలాడేసుకున్నారు. అదే సమయంలో వాళ్ళబట్టలనీ, వస్తువులనీ అన్నింటినీ మూటకట్టి చటుక్కున గట్టుమీది చెట్టెక్కి వాళ్ళకి కనబడకుండా కూచున్నాడు.

వీళ్ళు గట్టెక్కి బట్టలు కట్టుఉకుందామని చూస్తే బట్టలేవీ? మరెవళ్ళైనా మనతోపాటు వచ్చేరా? లేక ఆకాశం వచ్చి బట్టలెత్తుకు పోయిందా? దిక్కులు పట్టుకు పోయినాయా? చెరువే బట్టలని మింగేసిందా? లేక కృష్ణుడు ఎత్తుకు పోయాడా? అని కలతచెంది మనకేమిటైంది అంటూ ఆనాడు సీతాదేవి ఆంజనేయుడిని ఎదురుగా చూసి "ఏమిటీ మతిభ్రమ, ఇక్కడ ఏమిటి రాముడి కథ వినపడడమేమిటి? నేను చూస్తున్నది కలా నిజమా" అని గిల్లి చూసుకున్నదట. అట్లా వీళ్ళుకూడా ఎన్నో అనుమానాలు పడి చివరికి అంతటా చూస్తే చెట్టు మీద బట్టలమూటతో కూర్చొని ఉన్న కృష్ణుడు వీళ్ళకంటపడ్డాడు.

చూసిన తరువాత ఈతను మనవెనకే వచ్చేడు మనంకూడా ఈతని వెనకనించి వెళ్ళి బట్టలు తెచ్చుకోవటానికి ఉపాయం చూడాలి అనుకున్నారు. ఇతగాడిని యాచించినవాళ్ళు, బతిమలాడేవాళ్ళు, కోపగించుకున్నవాళ్ళు ఇలా రకరకాలైనవాళ్ళుగా మారిపోయి ఇతగాడిని ఇట్లా అల్లరి పనులు చేసేటట్లు చేసినది ఒక్కర్తే అని ఆమెకి భయపడి, తమ ఆర్తిని చెప్పుకొని బతిమాలుకుంటే ఆయన వాళ్ళ బట్టలు వాళ్ళకిచ్చేసి వాళ్ళని సంశ్లేషించేడు. ఈవిధంగా ఈఘట్టం పూర్తి అయింది.

ఇది వెనుకటి తిరుమొళ్ళిలో కామార్చనని చెప్పి తరువాత ఈవిధంగా గోపవృద్ధులే గోపికలకి కృష్ణసమాగమం మరింతగా భోగ్యమవటానికి కల్పించినదిగా చెప్పటం కల్పనే అయినా చాల అందమైనది. ధనుర్మాసస్నానవ్రతం తరువాత పుష్యం, మాఘం ఫాల్గుణమాసాల్లో కామార్చన చెయ్యటం అనేది పూర్వకాలంలో ఉండేది. మరొకసారి సంశ్లేషం కావాలి. అంటే గోపికలు కామసమార్చనం చెయ్యటం, అప్పుడు కృషణుడు బొమ్మరిళ్ళని పాడుచెయ్యడం జరుగుతూనే ఉంటుంది. ఇందులో సందేహం లేదు. వస్త్రాలని అపహరించటం వృత్తాంతంతోటే దీన్నికూడా ఆండాళ్ సాయించిందని చెప్పుకోవచ్చు. గోపికా వస్త్రాపహరణం శ్రీమద్భాగవతంలో చాలా ప్రసిద్ధమైన ఘట్టం.

ఇందులో కాత్యాయనీవ్రతానికి అంగీకరించకుండానే ఆయన ఈవిధంగా వస్త్రాలని అపహరించేసేడని చెప్పవచ్చు. దేవతాంతరార్చనని కృష్ణుడు అడ్డుకుంటున్నాడని ఇక్కడ తెలియచెయ్యటం జరుగుతోందని ఈ తిరుమొళ్ఝియొక్క అంతరార్థం.

మూ. కోళ్ఝియళ్ఝైప్పతన్ మున్నఙ్గుడైన్దు నీరాడువాన్ పోన్దోమ్
ఆళ్ఝియన్ శెల్వనెళ్ఝున్దానరవణైమేల్ పళ్ళికొణ్డాయ్
ఏళ్ఝమైయాఱ్ఱవుమ్ పట్టోమినియెన్డుమ్ పొయ్కైక్కు వారోమ్
తోళ్ఝియుమ్ నాముమ్ తొళ్ఝుతోమ్ తుకిలైప్పణిత్తరుళాయే 1

ప్రతిపదార్థము: అరవు అణైమేల్ పళ్ళికొణ్డాయ్= శేషుడిని పడుకగా చేసికొని పండుకొని ఉన్నవాడా - శేషశయనా! కుడైన్దు నీరాడువాన్= మునిగి స్నానం చెయ్యటానికి కోళ్ఝియళ్ఝైప్పతన్ మున్నమ్= కోడి కుయ్యటానికి ముందే పోన్దోమ్= వచ్చేము. శెల్వన్= సంపదలు గలవాడైన ఆళ్ఝియన్= మండలాకారంలోనున్న సూర్యుడు ఎళ్ఝున్దాన్= సముద్రంలోంచి ఉదయించేడు ఆఱ్ఱ ఏళ్ఝమై ఉమ్= సౌలభ్యాన్నంతటినీ పట్టోమ్= అనుభవించేము ఇని= ఇకపైన ఎన్డుమ్=ఎప్పటికిని పొయ్కైక్కు= చెరువునకు వారోమ్= వచ్చేవాళ్ళం కాము తోళ్ఝియుమ్= చెలికత్తెలున్నూ నాముమ్= మేమున్నూ కలసి తొళ్ఝుతోమ్= సేవించుకుంటున్నాం తుకిలై= మా వస్త్రాలను పణిత్తరుళాయ్= మాకు ప్రసాదించి కటాక్షించు.

వ్యాఖ్యానము: (మొదటి పాశురం) బ్రాహ్మముహూర్తానికి ముందరే కోడి కూస్తుంది. ఆవిధంగా కాలాన్ని చెప్తుంది. అంటే మనకి సమయాన్ని చెప్పి లేపుతుందన్నమాట. దానికిముందే మేం స్నానానికి వచ్చేం. ఎందుకంటే – రాత్రి గోపికలతో చేరి ఆతరువాత వెన్న,పాలు, పెరుగూ దొంగతనం చేసి నిద్రించే నువ్వు మా వెనకబడలేవని. నువ్వు మెలకువగా ఉన్నప్పుడు మేం చక్కగా పరిశుద్ధంగా నీ ఎదురుగా వచ్చి నిలబడాలనీ, స్నానానికి ఇంకా ఎవళ్ళూరాకముందు వస్తే బట్టలని విప్పేసి తొందర లేకుండా చక్కగా చల్లబడేటట్లు స్నానం చెయ్యవచ్చుకదా అని వచ్చేం. అయితే ఇప్పుడేమైంది? మనం అనుకున్నది ఒకటి అసలు జరిగినది

మరొకటైంది. కృష్ణుడు రాత్రి ముందుగా ఆడవాళ్ళ బుజాలతోనూ స్తనాలతోనూ ఆడుకొని తరువాత పడుక్కుంటాడు అంచేత ఇప్పుడు అతనికి మనం ఇలా రావటం తెలుసుకోలేడు అని అనుకొని వచ్చేం. మనం ఇలా అనుకుంటే ఆయనేమో కోడికూయటంతోనే లేచిపోయినాడు. మనం పడుక్కున్నప్పుడు తాను పడుక్కొని, కోడి కుయ్యగానే లేవటం చూసి మన సంగతులన్నీ తెలుసుకున్నట్టుంది. ఎలా పడుక్కున్నాడంలే కోడి కూపి లేపాలన్నట్టుగా నిద్రపోయినాడు. "ఇలా నా కళ్ళుకప్పి నేను లేవకుండా మీరు ఇక్కడికి రావడం ఏంచేద్దామని" అన్నాడు. (కుడైన్దు నీరాడువాన్ పోన్దోమ్) నీవల్ల కలిగిన విరహతాపం చల్లార్చుకొనేందుకు ఆనాడు భరతుడు సరయూమవగాహతే" అన్నట్లుగా మేంకూడా స్నానం చేఏద్దామని బయలుదేరేం. నువ్వు వస్తావని వచ్చిన వాళ్ళం కాము. నువ్వు రావటానికి ముందే స్నానం చేసి తిరిగి వెళిపోవాలని వచ్చేం. అయితే ఎందుకువచ్చేరో ఆపని చెయ్యకుండా కూచున్నారేమి?" అని ఈయన ఒకటి చేద్దామని అనుకున్నాడు. అంటే, తమిళంలో సంశ్లేషాన్ని "శునైయాడల్ – జలకాలాడటం" అని పేరుపెట్టి చెప్తారు. ఆప్రకారం తాననుకున్నది జరగటానికి అలా అన్నాడు. 'నువ్వు అలా చెయ్యటానికి కుదరదు. నువ్వు అనుకొన్నదాన్ని తెలుసుకొని శ్రీమంతుడైన సూర్యుడు ఉదయించేదులా ఉన్నది. (ఆళ్ళియన్ శెల్వన్ ఎళ్ళున్దాన్) పముద్రంలో ములిగి లేచినట్లు ఉదయించేడు. అయితే బాగుంది ఎవళ్ళకి లాభం మీ అవయవసౌష్ఠవాలని చూసి ఆనందించటానికి తగినట్లున్నది. మీరే ఒకపనిలో ప్రవేశించటానికి ముందుగా చెయ్యాలని కదా బయలుదేరేరు. మీరేమిటనుకున్నారు? అన్నాడు. నీ నిద్ర నిజమైనదనుకొని వచ్చేం." అన్నారు. " వినతైశిఱువన్ శిఱకెన్నుమ్ మేలాప్పిన్ కీళ్ వరువానై – వినతాసుతుడి రెక్కలనే చాందినీకింద వచ్చేవాడిని"(14–3) అని చెప్పినట్లు ఈ అవతారం రెండుపక్కలకీ(మనుష్యుడుగా ఉన్నపుడు ఆయన పరత్వం తెలిసేటట్లు) విస్తరించి ఉండటంవల్ల శేషుడిమీద పవళించిఉన్నవిధం వాళ్ళకి వివరంగా చెప్పినట్టైందన్నమాట. లేదా పాలసముద్రంలో ఆయన శయనించి ఉండడం తల్చుకొని చెప్పినట్లు కావచ్చును. అలా చెప్పుకొనినప్పుడు "నీ రక్షణలో మాకు విశ్వాసంచేత మేం వచ్చేం" అన్నారన్నమాట. "సరే అయితే ఇప్పుడేమైంది?" (ఏళ్మైయావుమ్ పట్టోమ్) బాగా చిక్కుపడ్డాం సరే ఇంతకంటే ఎక్కువ మరేమి

వస్తుంది గనుక? ఇన్నాళ్లూ పడ్డపాట్లున్నీ ఇవాళ ఒక్కరోజులో మాకు పట్టించేవు! ఎంతోమంది స్నానానికి వచ్చేరు నీళ్ళలోంచి బయటికి రాలేకపోతామే అని మునిగి స్నానంచెయ్యటం పోయి నిన్ను యాచిస్తున్నాం. అరవణై పృళ్ళికొణ్డాయ్ – ఇక నీసంగతి చూడు – అవును నేను బాగా దొంగతనంచేసేను. అంచేతనే ఇక్కడకి వచ్చి నిద్రపోతున్నాను అని చెట్లకొమ్మలనే మంచి అందమైన శేషుడిగా చేసుకొని మేం వినిపించేదాన్ని విననివాడులాగా పడుక్కున్నావు. లోకంలో దాసులు దాసీలవంటివాళ్ళని యజమానులు ఏంచేసినా వినిపించుకునేవాళ్ళు లేరంటారు కదా! నువ్వు మా బట్టలనుకూడా అపహరించి హాయిగా సమాధిలో ఉన్నట్లు ఉన్నావు. ఇంతకంటే కొంటెతనమేముంది? నన్నువదిలి చెరువుకెందుకు రావాలి అంటావా? ఇక రాము. వస్తే ఇంట్లో ఉండినందుకు పైగా అవమానం ఎక్కువైంది. "ఏంచేస్తాం చేసినదాన్ని అనుభవించక తప్పదు కదా? మరి మీరు దీన్లోంచి ఎలా బైట పడదామను కుంటున్నారు? దీనికి దారి ఏముంది మరి ఇంకెప్పుడూ రాము. ఊళ్లో వాళ్ళందరూ ఆడపిల్లలుసుమా అల్లరి కృష్ణుడున్నాడు జాగ్రత్త" అని కట్టుబాటు చెయ్యడం వల్ల నీకు లొంగిపోయి ఉండడానికి కుదరదు. చెరువుకి ఇక రాబోం, అంతే కదా!" అన్నారు. "మేం ఇక రాం అంటూనే మీరు వస్తూనే ఉన్నారే" "ఇక మరెప్పుడూ రాము" ఇలా వాళ్ళు అనేసరికి చెడిపోయిందే అని భయపడ్డాడు. "వీళ్ళనీ నన్నూ ఒకచోటికి ఎవళ్ళు చేరుస్తారా" అని ఆలోచించేడు. ఒక్క అంజలిముద్ర తప్పితే మరేమి లేదు అని నిశ్చయించుకొని మొదలు పెట్టేడు. "సరే అదలా ఉండనీయండి. చేసిన తప్పుకి దండం పెట్టండి. చెరువుకి రావటం, వచ్చి నోము నోచుకుంటున్నాం అని బట్టలు లేకుండా స్నానం చెయ్యడం, రెండు తప్పులు చేసేరు" అంటే – "ఇదిగో నమస్కారం చేస్తున్నాం. ఒక చేత్తో నమస్కారం చేస్తున్నాం. 'ఏకహస్తప్రణామం అనే ఒంటిచేతినమస్కారం చామరం వీస్తున్నవాళ్లుతప్ప ఇతరులు చెయ్యకూడదే! అందుచేత రెండు చేతులూ జోడించి అంజలి ఘటించి చేస్తేనే నమస్కారం అవుతుంది. పనికి రాదే' అంటే ఇదిగోఅదికూడా చేస్తున్నాం. మామానం రక్షించుకొనటానికి ఒక చెయ్యి కావాలి గనుక, రెండు చేతులు కలిపితేకాని అంజలి అవదు గనుక మాసొంతచెయ్యిఒకటీ, మానేస్తం చెయ్యి ఒకటీ కలిపి రెండుచేతులతో చేస్తున్నాం. మా వస్త్రాలని మాకిచ్చి కటాక్షించు" అన్నారు. ఆళ్వియన్ శెల్వన్–

ఈసందర్భంలో ఆళ్ఘియన్ అన్నపదానికి సూర్యుడు అని అర్థం చెప్పుకోవాలి. ఆళ్ఘి అంటే సముద్రం. అందులో రాత్రి ఉండిపోయి ఇప్పుడు ఉదయించేడు చక్రాకారంలోఉన్న సూర్యుడు పూర్తిగా ఉదయించేడు అని ఇక్కడ అర్థం. ఆళ్ఘి అంటే చక్రాకారం అని అర్థం ఇక్కడ చెప్తున్నాం అన్నమాట. శెల్వన్ – 'భీషోదేతి సూర్యః ' అని ఉపనిషత్తులో చెప్పినట్లు సర్వేశ్వరుడి నియమనం ప్రకారం నడుచుకుంటున్నాడు గనుక సంపన్నుడు అని భావం. అందరూ సంధ్యాసమయంలో సేవించుకునేందకు తగి ఉన్నాడన్నమాట. ఎందుకు సూర్యుడు ఉదయించేడు? మనందరికి మానంకాస్తా పోయిందే అని ఆయనని చెడ్డసూర్యుడు అని నిందించటానికి ఈవిధంగా వ్యతిరేకాన్వయంలో చెప్పటం అనేది ఉన్నది. సూర్యుడు ఉదయించినది మంచి కాలం. లేకపోతే కృష్ణుడు ఎంతసేపైనా మనలని వదలడు. ఇక పైవాళ్ళు వచ్చే సమయం దగ్గరపడుతోంది గనుక మంచిదైంది. అని సూర్యుడిని పొగిడినట్టుకూడా చెప్పవచ్చు.

ఇక ఈమాటలు కృష్ణుడిని చూసి చెప్పిన మాటలు కావు. వాళ్ళలో వాళ్ళే అనుకుంటున్నమాటలు. అంటే కోడికూసే లోపుగానే వచ్చేమే కృష్ణుడు అప్పుడైతే రాడనికదా! ఇదిగో చూడండి బట్టలు కనబడడం లేదు ఆ చక్రధారియైన శ్రీమన్నారాయణుడు వేంచేసేడనిపిస్తోంది. అని అనుకుంటున్నారు. ఇంతలో నేను ఇక్కడే ఉన్నానని చెట్టుమీంచి బైటికి వచ్చేడు. ఆ తరువాత చెప్పుకుంటున్నారు. ఆయనే వచ్చి పట్టుకు పోయుండాలి. ఆయన చెట్టుమీద ఉండడం మొదట మనకి తెలియలేదు. అంచేత ఎత్తుకుపోయి తనచోటికి పోయి పడుక్కోవటానికి పోయిఉంటాడనుకుంటున్నాం అని అరవణైమేత్ పళ్ళికొణ్డాయ్ అని తమ వస్త్రాలని తమకు కటాక్షించమని అంటున్నారు. ఏళ్మై అన్నప్పుడు కొంతమంది ఏళ్లైమై అని అనుసంధిస్తారు. తోళ్ఘియుమ్ నానుమ్ అని కొన్ని పాఠాలున్నాయి కాని తోళ్ఘియుమ్ నాముమ్ అన్నపాఠమే బాగుంటుంది.

అవతారిక: కురున్దవృక్షంమీద కృష్ణుడిని చూడటాన్ని చెప్పి, ఆయన ఇద్దరు కలిసి పెడితే అది అంజలి అవదు. తమంతట తామే చెయ్యాలన్నదానికి సమాధానంగా చెప్తున్నారు.

మూ. ఇతువెన్ పుకున్దతిజ్గన్దో విప్పొయ్కైక్కెవ్వాఱు వన్దాయ్
మతువిన్తుழాయ్ ముడిమాలే మాయనేయెజ్గళముతే
వితియిన్మైయాలతుమాట్టోమ్ విత్తకప్పిళ్ళాయ్విరైయేల్
కుతికొణ్డరవినడిత్తాయ్ కురున్దిడైక్కూఱైపణియాయ్ 2

ప్రతిపదార్థము: *మతు*= తేనెగల *ఇన్*= మధురమైన *తుழాయ్*= శ్రీతులసిని *ముడి*= కిరీటమునందుగల *మాలే*= శ్రియఃపతీ! *మాయనే*= ఆశ్చర్యభూతుడా! *ఎజ్గళ్ అముతే* = మాకు భోగ్యమైనవాడా! *ఇజ్గు పుకున్దతు ఇతు*= ఇచటికి నీవు వచ్చుట అనునిది *ఎన్*= ఎందులకు? *అన్దో*= అయ్యో! *ఇ పొయ్కైక్కు*= ఈ తటాకమునకు *ఎ ఆఱు*= ఏవిధముగా *వన్దాయ్*= వచ్చినావో *విత్తకమ్ పిళ్ళాయ్*= చతురతగల పిల్లవాడా! *వితి ఇన్మైయాల్*= వేరు గతి లేనందున *అతు*= నీవు అడిగినదానిని *మాట్టోమ్*= అంగీకరించలేము *విరైయేల్*= తొందరపడకుము. *కుతికొణ్డు*= గెంతిగెంతి *అరవిల్*= కాళీయుని తలపై *నడిత్తాయ్*= నృత్యము చేసినవాడా! *కురున్దిడై*= కురున్దవృక్షమున నున్న *కూఱై*= (మా)వస్త్రములను *పణియాయ్*= ఇయ్యవలెను.

వ్యాఖ్యానం: (రెండవ పాశురం) “వాళ్ళకి కావాలిసినదాన్ని పొందటంకోసం ప్రయత్నిస్తున్నారు వీళ్ళు. నాకేమిటికావాలో వీళ్ళు పట్టించుకోవటం లేదు. ఏంచెయ్యటం? ఇలా కుదరదు” అని కురున్దవృక్షంమీదినుంచి దిగి, వాళ్ళు విప్పి ఒడ్డున పెట్టుకున్న బట్టలని సుడిగాలిలావచ్చి చటుక్కున చుట్టి పట్టుకుపోయి “ఫలానిది చేసేడు” అని వాళ్ళు ఊహించటానికి కూడా సాధ్యంకానివిధంగా బట్టలతోపాటు వాళ్ళహృదయాలలోకూడా నిండిపోయి తొందరగా చెట్టెక్కి దాక్కున్నాడు. వీళ్ళందరూ స్నానాలు ముగించుకొని గట్టుమీదికి వచ్చి అక్కడ బట్టలు కనబడకపోయేసరికి ఏంచేయాలో తెలియక దిగాలుపడిపోయినారు. (ఇతువెన్ పుకున్దతిజ్గు) “మెరుపులు లేకుండా పిడుగుపడినట్లు కనబడుతోంది. నువ్వు ఉలుకూ పలుకూ లేకుండా ఉన్నావే, పిడుగు పడటం నీకు వినపడిందా? ఏమి వచ్చి మన బట్టలన్నీ మాయమైనాయి?” అని వాళ్ళలో వాళ్ళు అనుకున్నారు. దేన్నిగురించి ఒకరినొకరు అడుగుతున్నారో దాన్ని చూస్తే చెప్పుకోకుండా ఉంటారా? వినీవినటంతో కనబడకుండా పోయేవాడు కనబడితే గాభరా పడకుండా ఉంటారా? ఆకట్టిపడేసే గుణాలని వింటేచాలు కనబడకపోయినా అవి అల్లరిపెట్టుతూంటే ఆయనగురించి చెప్పుకోకుండా

ఉండగలరా?‘ఇతువెన్ పుకున్దదిఙ్గన్దో’ అని ఒకరితొ ఒకరు కృష్ణుడిని ఇతు అంటూచేతితో చూపించి వాళ్ళలో వాళ్ళు చెప్పుకున్నది కావచ్చును. (అన్దో!) “మనం ఏమనుకున్నామో అదికాస్తా అతను మనలని దుఃఖ పెట్టటానికి పనికివచ్చిందే! మనం ఇతగాడు లేవకముందే తిరిగి వచ్చేద్దాం అని బయలుదేరేం, కాని ఇతగాడు మనకంటే ముందుగా వచ్చి నిల్చున్నాడు” అనుకుంటున్నారు వాళ్ళు.

నన్ను ఇక్కడ చూసి మీరింతగా ఏదో పోగొట్టుకున్నాం అన్నట్టు బాధపడుతున్నా రేమిటి? నేను ఇదివరకు మీతో రాలేదా? అని కృష్ణుడు అన్నాడు. (ఇప్పొయ్కైక్కెవ్వాఱు వన్దాయ్) ఈచెరువుకెలా వచ్చావునువ్వు? నువ్వూ మేమూ జలకాలాడిన చెరువుకాదే ఇది? నీకెలా తెలిసింది మేం ఇక్కడికి వస్తామని? మేము ఈ చెరువుకే వచ్చేమని ఎలా తెలుసుకున్నావు? నిన్ను మాతో తీసుకొనివద్దామని మేం అనుకోలేదు. అందుకే నిన్ను అడ్డుకునేందుకు పెద్దవాళ్ళని పెట్టేమే! వాళ్ళని ఎలా తప్పించుకున్నావు? మరో దారివెంబడి వచ్చేవా? మారువేషం వేసుకొని వచ్చేవా? నువ్వు మారువేషం వేసుకున్నా నీకిరీటంమీది తేనెలూరే తులసిమాల నిన్ను పట్టించి వేస్తుందే! ఏమి మాయగాడివయ్యా నువ్వు! మేం వచ్చినప్పుడు మా అడుగుల గుర్తులనికూడా చెరుపుకుంటూ వచ్చేం. నువ్వు ఏదారిలో వచ్చేవు? ఆనాడు గజేంద్రుడున్న చెరువుకనుకొని నువ్వు మచ్చేవా! ఏదో మా ఆర్తనాదం వినీ రాలేదే! ఏలా వచ్చావు? కాళీయుడు ఉన్న మడుగని వచ్చేవా? లేక మొసలి ఉన్న చెరువని వచ్చేవా? నీకు కావలసినవాళ్ళు ఉన్న చెరువు కాదే, లేక నీ పగవాళ్ళు ఇక్కడ దాక్కొని ఉన్నారని వచ్చేవా? ఏమార్గంలో వచ్చేవు స్వామీ?” అని అడుగుతున్నారన్నమాట.

“నేనెలా వస్తే మీకేమి? వచ్చేను కదా! కావలసినది చేతికి దొరికితే అది ఎలా వచ్చిందని చూస్తామా?” అన్నాడు. వీళ్ళు తనవిషయంలో తనకి ఓడిపోవటంతో తానే గెలిచేనన్న గర్వంతో ఇక మాటాడటం మొదలుపెట్టేడు. “కర్మ, వీడి చేతికి చిక్కేం, ఇలాకాదు మనకి కావలసిందాన్ని తెచ్చుకోవటం. పొగడ్తలికి లొంగేవాడితను. అంచేత పొగడటం చేద్దాం” అని అతనిని పొగడటం మొదలుపెట్టేరు.(మతువిన్దుళాయ్ ముడిమాలే) ఇతు అంటూ అలక్ష్యంతో చెప్పినట్టు అనుకోవద్దుసుమా! అని మధు ఇత్యాది పదప్రయోగంతో ప్రార్థిస్తున్నారు. “మాతో కలవాలనుకుంటే, అది రాత్రి పొద్దుపోకమునుపే కలవవలసింది కదా. మేము ఇక్కడికి రావటం నీకిష్టం లేకపోతే,

బయలుదేరినప్పుడే అడ్డుకొని ఉండవలసింది. మాతో జలక్రీడ ఆడాలనుకుంటే నువ్వుకూడా నీ పీతాంబరాన్ని ఒడ్డున పెట్టి దిగవలసింది. బట్టలని దొంగిలించటమెందుకు? తెలియదా? నీవే సర్వాధిపతివి అని తెలిపే తులసిమాలతో నిత్యసూరులకి సేవ సాయిస్తూ, నీపరత్వం ప్రకాశిస్తూ పరమపదంలో సర్వేశ్వరుడివై వేంచేసి ఉన్నవాడివి." ఈ విధంగా పరమాత్మయైన శ్రీకృష్ణుని చెప్తున్నాయి ఈ పదాలు. (మాయనే) "అటువంటి సేవ ఇక్కడ ఉన్నమాఅందరికీకూడా సాయించాలని మామీద ఉండే వాత్సల్యంతో ఇచ్ఛాపూర్వకమైనజన్మగలవాడివి కర్మవశ్యులైన మాతోబాటు మాలో ఒకడుగా వచ్చి అవతరించి గోపాలకులందరూ నిన్ను ఆజ్ఞాపించి మరీ తీసుకోగలిగేటట్లు అందరికీ సులభుడివై ఉండటమే మహదాశ్చర్యం కదా!" మతువిన్తుళాయ్ముడిమాలే – భోగ్యమైన తేనెలూరుతున్నతులసిమాలచుట్టబడిన కిరీటంతో ఉన్నవాడా! అని నిత్యసూరులని వ్యామోహపరిచే నిత్యవిభూతినాథుడిని చెప్పటం జరిగింది. మాయన్ అనే పదప్రయోగం మాయ అనబడే లీలావిభూతికి ఈశ్వరుడీయన అని చెప్తోంది. (ఎజ్ఞళముతే) "మాఅందరికీ సులువుగా అందుబాటులో ఉండడమే కాకుండా మాకే చెందినవాడివైమాకు పరమభోగ్యుడివిగానున్నవాడివి. దేవతలకి సముద్రంలోంచితీసిచ్చిన ఉప్పుచారురసంలా కాకుండా మాకు అందించబడిన పరమభోగ్యమైనఅమృతుడివి నువ్వు." ఎజ్ఞళముతే అని పిలవటంలో నువ్వు ఇక్కడకి రావటం మాకు ఇష్టమే అంటున్నట్టు సూచిస్తున్నది ఆండాళ్‌తల్లి.

"మీరే నా గొప్పతనం తెలుసుకున్నారు కదా! మీవాడిని అన్నట్టు చెప్తున్నారే! మాది అని తెలిస్తే భయపడకుండా దాన్ని ఉపయోగించుకోవాలి కదా?" అన్నాడు. అదేమిటి అన్నారు. "మీ కళ్ళతో నన్ను చల్లగా చూస్తే నేను బతికిఉండేటట్లు మీరు నేనూ కలిసి హాయిగా అనుభవించవచ్చుగదా! – అయితే శాస్త్రప్రకారం అంజలిముద్రతో నమస్కరించండి" అన్నాడు. (వితియిన్మైయాలతు మాట్టోమ్) "అది కుదరదు గదా! అలా అయితే ఎంత బాగుండేదో, కాని మా దురదృష్టం వల్ల ఆపని చెయ్యలేం." అన్నారు. "ఆ పని" అన్నారు ఆయన దేన్ని కోరుకుంటున్నాడో అది వాళ్ళకి తెలిసినట్టుగానే. "అయితే నేనుకూడా నాదురదృష్టం చేత బట్టలని ఇవ్వలేకపోతున్నాను" అని వాటిని తీసుకొని చిటారుకొమ్మమీదికి ఎక్కి కూచున్నాడు. ఇతగాడికి దురదృష్టం ఏమిటిట?– వాళ్ళతో కలవలేకపోవడమే నంటారు

పెరియవాచ్చాన్పిళ్ళై. (అతుమాట్టోమ్) ఇప్పుడు మాకు ఆ భాగ్యం లేదుగదా! మామానాన్ని రక్షించుకోవాలి కదా! అంజలిముద్రతోనే మాబట్టలు ఇయ్యటం జరుగుతుంది అంటున్నావు బట్టలిస్తేనే అవి కట్టుకొని అంజలిముద్రతో నమస్కరించ గలం. ఇప్పుడు అంతమాత్రం చెయ్యటానికి మాకు అవకాశం లేదు. మరొక గతీ లేదు. చామరం వీచేవాళ్ళకి ఒంటిచేత్తో నమస్కరించటానికి అంగీకరించబడిందే ఏమి?మరొకచేతికి మరొక ముఖ్యమైనకార్యం ఉండడం చేతనే – అది మావిషయంలో కూడా ఉన్నదికదా! అంతేకాదు దుస్తులు ధరించినతరువాతనే కదా దేవతలకి నమస్కారం చెయ్యవలె. దిగంబరులై అంజలి చెయ్యవలెనని మాత్రం ఉన్నదా? పెద్దల ఆజ్ఞ లేనిదే ఆడపిల్లలు పురుషుడిని చేరటం అనేది ఉన్నదా? వాళ్ళునిశ్చయించి నిన్ను మా భర్తగా పొందిన తరువాత ఏది కావాలన్నాచేస్తాం. వాయువుయొక్క వాతబాధని పొందిన కన్యకల కథ రామాయణంలో చూడు. వెంకటాచలపతిని పొందాలనుకున్న ఆకాశరాజకుమార్తె కథని విను. (విత్తకప్పిళ్ళాయ్) – ఆశ్చర్యకరమైన చిన్నపిల్లడివి. నీ దృష్టి ఎక్కడ? అందుచేత చాలా చాతుర్యంతో మాటాడుతున్నావు.( విరైయేల్) మమ్ములను చంపాలని చూడకు. మాఆనందానికి అడ్డువచ్చినా తొందరపడి మమ్ములని నాశనం చెయ్యకు. దానికి తొందరపడకు. సమయం వచ్చినప్పుడు అన్నీ కుదురుతాయి.” “మన చేతిలో వాళ్ళబట్టలని చూస్తే కదా వాళ్ళు అడుగుతారు” అని బట్టలమూటని చెట్టు కొమ్మలమధ్యని దాచేసి చేతులతో చప్పట్లు కొట్టి “నా చేతిలో ఉంటే నేనివ్వనా? నేను తొందరపడి ఎక్కడ ఏమి సాహసం చేయటం చూసేరు? అన్నాడు. (కుతికొణ్డు అరవిల్ నడిత్తాయ్) “ఏకదా తు వినా రామమ్ – ఒకప్పుడు బలరాముడు  దగ్గర లేనప్పుడు” అని చెప్పినట్లు మీ అన్నయ్యగారు ఒక్కక్షణంపాటు దూరంగా ఉండేసరికి చక్కా వెళ్ళి పాము నోట్లో దూరిన నీకు ఇలాంటి పనులు ఏమైనా కొత్తవా? సరే అదలా ఉండనీ –(కురున్దిడై క్కూఱై ప్పణియాయ్) “మా బట్టలు నీ చేతిలో లేవా? చెట్టుకొమ్మలలో బట్టలని పెట్టి నాదగ్గర లేవు అని చేతులని చూపించి కొమ్మమీదకు గెంతుతున్నావు ఏమి ఆట!” నువ్వు కాళీయుడిమీద నువ్వు నాట్యంచెయ్యటం చూసేం.  అలాగే గెంతుకుంటూ బట్టలున్న కొమ్మమీదికి వెళ్ళి మాబట్టలని ఇయ్యి అని అంటున్నారన్నమాట. “చెట్టుమీదనున్నవాటిని తీసి ఇచ్చేయ్” అన్నారు. అవి ఎక్కడున్నా ఇతగాడి ఇష్టమైతేనే కదా ఏదైనా సిద్ధించేది!

మూ. ఎల్లేయీతెన్నవిళమై యెమ్మనైమార్ కాణిలొట్టార్
పొల్లాజ్గీతెన్టు కరుతాయ్ పూజ్గురున్దేఱియిరుత్తి
విల్లాలిలజ్గైయழித్తాయ్ నీ వేణ్డియతెల్లామ్ తరువోమ్
పల్లారుజ్గాణామే పోవోమ్ పట్టైప్పణిత్తరుళాయ్. 3

ప్రతిపదార్థము: విల్లాల్= విల్లు అను ఆయుధమొక్కదానిచేతనే ఇలజ్గై= లంకానగరమును అழித్తాయ్= నశింపచేసినవాడా! ఈతు= ఇది ఎన్న= ఎటువంటి ఇళమై= చిన్నపిల్లల చర్య అగును? ఎల్లే= ఏమే ఎమ్మనైమార్= మాతల్లులు కాణిల్= ఈ స్థితిని చూసినచో ఒట్టార్= మనలను నమ్మరు, త్రోసివేయుదురు ఈతు= ఇటువంటి నిర్వహణమై యున్నది పొల్ లాజ్గు= చెడునడవడి ఎన్టు= అని కరుతాయ్= నీవు తలంచలేదు. పూ కురున్దు= పూతపట్టిన కురున్దవృక్షమునందు ఏఱి ఇరుత్తి= మీదిదాకా(చివరి కొమ్మను) ఎక్కియున్నావు నీ వేణ్డియతు= నీవు కోరినవాటిని ఎల్లామ్= అన్నింటిని తరువోమ్= ఇచ్చెదము పల్ ఆర్ ఉమ్= ఎంతోమంది ఎవరును కాణామే= కనబడకుండునట్లు పోవోమ్= ఇండ్లకు పోయెదము పట్టై= మాపట్టువస్త్రములను పణిత్తరుళాయ్= మాకు ఇచ్చి కరుణించుము.

వ్యాఖ్యానము: (మూడవ పాశురం) వీళ్ళు చాలా సేపు నీళ్ళలో ఉండి బాధపడుతూ ఉన్నా, వాళ్ళబట్టలన్నింటినీ తీసుకొని చెట్టుమీద పెట్టేసేడు. "మేం చీళ్ళలో ఎంతోకాలం నిలబడి బాధపడుతూంటే నువ్వు మాటాడవేమి? మాబట్టలని ఇచ్చెయ్" అన్నారు. "బట్టలు కావాలనుకున్నవాళ్ళందరూ, గట్టెక్కి రండి" అన్నాడు. అది నిజమని కొందరు గట్టెక్కేరు. అలా గట్టెక్కినవాళ్ళ అంగాలని బాగా తేరిపారచూసి ఏవో కొన్ని చేష్టలు చేసేడు. (ఎల్లే యీతెన్నవిళమై) "ఏయ్! ఇదేమి చిన్నపిల్లచేష్టలు చేస్తున్నావు!" అన్నారు. "నేను చిన్నపిల్లడినే అయితే మీరు పదిహేనేళ్ళవాళ్ళా? మీకూ నాకూ తేడా ఏముంది? రెండుపక్కలా సరిసమానమైన వయస్సైతే ఆ వయస్సుకి తగినట్లు మనం ఉండాలికదా మీరు అలా ఉండటం లేదు" అన్నాడు. "చిన్నపిల్లల చేష్ట అంటున్నావు. ఇట్లాంటిది ఒక చిన్నపిల్లల చేష్ట అవుతుందా? అందరికీ తెలిసేలా చెరువులో ఎంతోమంది ఆడపిల్లలు కలిసి స్నానం చేస్తున్నపుడు

అందరినీ దిగంబరులుగా చేసి ఏడిపించటం చిన్నపిల్లల చేష్ట అవుతుందా? ఇదేమిటి యౌవనమనే వయస్సా లేక బాల్యమా? మా బాల్యాన్ని చూసి మోహపడటం ఎక్కువైందంటే మా బాల్యం ఏమిటి? స్తనప్రాదుర్భావం కూడా అవలేదే! చిన్న ఆడపిల్లలం. ఎమ్మనైమార్ కాణిలొట్టార్ – మేం నీతోపాటు నీలాగే చెయ్యాలా? మాపెద్దవాళ్లు చూస్తే మమ్మల్ని వదులుతారా? నీళ్ళలో ఉండి నువ్వు చేసే అల్లరికి ఏడుచుకుంటూ వస్తే ఒకసారి పెద్దవాళ్ళు మమ్మల్ని పిలుచుకుపోవచ్చు. బట్టలు లేకుండా నీకోసం గట్టెక్కి నిలిచి ఉన్నప్పుడు మా తల్లులుగాని చూస్తే ఇక ఇంకేమైనా ఉన్నదా? మమ్ములని ఇంటికే రానియ్యరే! నీతో ఇక అంతకన్నా చేరనియ్యరు. నీ బాల్యచేష్ట అనేది అల్లరితనమే. ఇది మంచిపని అని తెలియక చేస్తున్నావులా ఉన్నది."

మీకేనా తల్లితండ్రులున్నది? నాకు మాత్రం అమ్మా నాన్నా బంధువులు ఎవళ్ళూ లేరా? నేనేమైనా ఆకాశంనుంచి ఊడిపడ్డానా? వాళ్ళున్నారు కనుకనే నేనిక్కడ ఉన్నాను మీకు అలా లేదు కదా?" "మాలాగా నువ్వు?" మాకు తేడా ఏమిటి అంటే నీకున్నది. " (పొల్లాఙ్గు ఈతెన్ఱు కరుతాయ్) నీకు అపనింద ఏమిటన్నట్లుగా ఉన్నావు. మేం అపనిందకి భయపడవలసినవాళ్ళం. ఇదే నీకూ మాకూ ఉన్న తేడా"

*(పూఙ్గురున్దేఱియిరుత్తి)* "నేను *అపనిందకి భయపడినా* మీకివి ఇవ్వడం లేదుకదా!" అంటూ చెట్టుమీద పూచినపువ్వులా బట్టలమూటతో ఇవ్వాలనే మాటే ఎత్తకుండా చక్కగా కూచున్నాడు" (విల్లాలిలఙ్గైయళిత్తాయ్) – ఒక స్త్రీకోసమని, బ్రహ్మాదుల అస్త్రాలకికూడా లొంగకుండా వరబలంచేత మదించిపోయినవాడి ఊరుని నశింపచేసేవు. సముద్రాన్నే వశంచేసుకొని దానిని దాటి లంకనే నశింపచేసేవే. ధనుస్సుతో జయించిన నీకు అక్కడికి వెళ్ళా లని నిర్బంధం లేదే! మల్లయుద్ధమైతే మరొకరికి దగ్గరలో ఉండాలి. ధనుర్బాణాలతో జయించటానికి మరొకచోటునుంచి కూడా బాణం వెయ్యవచ్చునుకదా! సముద్రుడు నిన్ను శరణు పొందేటప్పుడు అక్కడినుండి చాలా దూరంలోనున్న మరుప్రదేశాన్ని గురిచూసి వేయటం నీకు కిష్కింధనుంచే బాణాన్ని వేయతగిన శక్తి ఉండెను కదా! వాలిలాగనే వాడుకూడా నిజంగా దండింపబడవలసినవాడే. అయినా, ఆమె ఉన్న స్థలానికి వెళ్ళి ఇతరులని సంహరించావే! ఇప్పుడు మావిషయంలో దగ్గిరకి వచ్చి ఇవ్వడానికి బదులుగా చెట్టెక్కి కూచున్నావు! ఎందుకు మరొకలా వ్యవహరిస్తున్నావు? మేము అక్కడికి రాగలమా?

నీ ఇత్యాది- ఇప్పుడు నేనూ మారలేదు, మీరూ మారలేదు. మీ స్వభావం అలాగే ఉండాలి. నేను కోరినది మీరు ఇవ్వటం లేదు. మీకూ, సీతాదేవికిన్నీ ఎంత వ్యత్యాసం ఉన్నదో అనటానికి ఇది సమాధానం. నీకు కావాలనుకున్నవన్నిటినీ ఇవ్వటానికి ఎదురుచూస్తున్నాం." "అయితే ఇచ్చేయవచ్చును కదా!" (పల్లారుజ్గణాడమే పోవోమ్) కాని దానికి ఇది ప్రత్యామ్నాయమూ కాదు. సమయమూ కాదు. ఎవ్వళ్ళూ చూడకుండా అందరం తగిన స్థలానికి పోయి చేరుతాం " "ఎంతమంది చూస్తేనేమి? పోతే పోతారు నేను మొట్టమొదట చూసేనే. అలా అయితే వెళ్ళండి" అన్నాడు. (పోవోమ్ పట్టైప్పణిత్తరుళాయే) – నువ్వు చెప్పినట్టు ఆ స్థలానికి వెళుతాం. కాని ఇతరులదగ్గర నిలబడగలిగేటట్లు మా బట్టలిచ్చేయ్. అక్కడికి వెళ్ళటమైనా నువ్వు బట్టలివ్వకపోతే జరగటం కుదరదుకదా! కనుక మా బట్టలిచ్చి మమ్ములను కటాక్షించు మా మా ఇళ్ళకి మేం వెళిపోతాం. లేదా నీతో కలిసే చోటికి వెళతాం" అన్నారు. 3

ఇంతగా చెప్పినా జాలిపడకుండా చెట్టుకొమ్మలలో చీకటిలా దాక్కున్నాడు. కన్నీళ్ళుపెట్టుకుంటూ అడుగుతున్నారు.

మూ. పరక్కవిళ్ఙిత్తెజ్గుమ్ నోక్కి ప్పలర్కుడైన్దాడుజ్ఞునైయిల్
అరక్కనిల్లాక్కణ్ణనీర్కళలమరుకిన్దవాపారాయ్
ఇరక్కమేలొన్ఱుమిలాతా యిలజ్ఞైయళ్ఙిత్తపిరానే
కురక్కరశావతఱిన్దోమ్ కురున్దిడైక్కూఱైపణియాయ్. 4

ప్రతిపదార్థం: ఇలజ్ఞై= లంకాపురమును అళ్ఙిత్తపిరానే= నశింపచేసిన ఉపకారకుడా! పరక్క= విరివిగా విళ్ఙిత్తు= కన్నులు తెరిచి ఎజ్గుమ్= నాలుగు పక్కలను కంటికి అందినంత వరకును నోక్కి= బాగుగా చూచి పలర్= ఎంతోమంది కుడైన్దు= మునిగి స్నానము ఆడుమ్= చేయుచున్న శునైయిల్= తటాకమున అరక్కనిల్లా కణ్ణనీర్కళ్= అడ్డుకొనినను ఆపుకొనసాధ్యముగాని కన్నీటితోనున్నస్త్రీలు అలమరుకిన్ద= భయపడుచున్న ఆ= విధమును పారాయ్= చూడుము ఇరక్కమ్ ఏల్= దయ అనునది ఒన్ఱుమ్= కొంచెముకూడ ఇలాతాయ్= లేనివాడా! కురజ్గు అరశు ఆవతు= నీవు వానరులకు నాయకుడవగుట అఱిన్దోమ్= తెలిసికొంటిమి కురున్దు ఇడై= కురున్దవృక్షముపైనున్న కూఱై= బట్టలను పణియాయ్= ఇచ్చి కటాక్షించుము.

మూడవ తిరుమొఝి

వ్యాఖ్యానము : (నాలుగవ పాశురము) (పరక్కవిత్యాది) “వీళ్ళు నేను చెప్పినప్రతిదానికీ జవాబులు చెప్తున్నారు. ఇక అలా చేసి ప్రయోజనం లేదు. భయపెట్టి మనపని చేసుకోవాలి” అని అనుకున్నాడు. కృష్ణుడు. ఎవళ్ళోకొంతమంది వస్తున్నట్టు, చుట్టూ ఒకసారి చూసి, శరీరాన్ని జాగ్రత్తగా కనబడకుండా కొమ్మలలో దాక్కున్నట్లు చెయ్యటం, మళ్ళీ మరికొంతమంది వస్తున్నట్టు అందుకు తాను భయపడుతున్నట్టు ఆపక్కని కొన్ని కొమ్మలని చెట్టు ఆకులనీ తోసి తనని కనబడకుండా చేసుకోవటం, మళ్ళీ ఆకులని కొంచెం తప్పించి చూడటం, ఇలాంటివాటిని కొందరికి భయం కలిగేలా చెయ్యటం మొదలుపెట్టేడు. ఈ చెరువుకూడా ఎంతోమంది పురుషులు, స్త్రీలు స్నానం చేసే స్థలం. అంచేత ఇతగాడు చేస్తున్న చేష్టలు నిజమేననుకుందికి అవకాశం ఉన్నది.

ఇతగాడి భయంకలిగించే వ్యాపారాలవల్లనూ, అందరూ వచ్చే రేవుకావటం చేతనూ, వీళ్ళకి ఏడుపు వచ్చేస్తోంది. “సరే వీడి ముందర ఏడిస్తే ఎలాగ ఎలాగో వాడికి కనబడకుండా చూసుకోవాలి” అనుకున్నారు.“నువ్వు బట్టలివ్వకపోతే మానేయ్ కాని మేం పడుతున్న గాభరా చూడు” అన్నారు. అయినా కదలక మెదలకు కూచున్నాడు. “తెల్లవారిపోయినదే! ఎటుపక్కనుంచి ఎవరు వస్తారోనని అన్నిపక్కలా చూస్తున్నాం. కష్టంవల్ల వచ్చే కన్నీళ్ళని ఎంత ఆపుకుందామన్నా ఆగటం లేదు. ధారలు కారుతున్నాయి. ఈస్థితిలో మేం బాధపడటం చూడకుండా పెద్ద కోతులకంటే మీదకి కొమ్మలను దాటుకుంటూ దాటుకుంటూ దాక్కుంటున్నావు. లంకానగరాన్ని నాశం చేసి సీతాదేవిని కాపాడినవాడివి ఈమాత్రం జాలి లేకుండా ఉండడం ఆశ్చర్యం వేస్తోంది. నీ మనస్సు కోతిమనస్సులాగ నిలకడలేనిదా? అంచేతనే జాలి పోయిందా? సుగ్రీవుడిని మహారాజుగా పట్టాభిషేకం చేసి అతనికి చక్రవర్తిగా నున్న నీకు కోతులకి రాజవటం తెలికే. ఆనాటినుంచీ కోతులతో ఉండటంవల్ల ఆగుణాన్ని తెచ్చుకున్నట్లు కనిపిస్తోంది. కురుందవృక్షంమీద బట్టలని పెట్టివేసి పక్కచెట్టుమీదకి దుముకుతున్నట్లు కనబడుతోంది. నువ్వున్న చెట్టుమీద లేకపోయినా కురున్దవృక్షంమీదనున్నాయి. వాటిని మాకు ఇచ్చివేయుము అని అంటున్నారన్నమాట.

నోక్కి – చూస్తున్నవాడు కృష్ణుడైతే, నోక్కిప్పారాయ్ అని అన్వయం సుఖంగా కుదురుతుంది. అప్పుడు ఎఙ్గుమ్ నోక్కి అన్నదానికి ఒక్కతైనికూడా వదలకుండా

అందరినీ గమనిస్తూ అని అర్థం. లేదా, చెట్టుమీదనున్న నీకు స్నానానికి వచ్చేవాళ్ళని చూడటం సులభం గనుక ఎవళ్ళు వస్తున్నారో అని నాలుగుపక్కలా చూసి మాకు కన్నీళ్ళు ధారలు కారటంకూడా చూడు అని చెప్పుకోవచ్చును. మేం నాలుగుపక్కలా చూసి దుఃఖపడుతున్నాం అని చెప్పుకున్నపుడు చూస్తున్నవాళ్ళు ఈ ఆడపిల్లలన్నమాట. అప్పుడు పారాయ్ అన్నపదంతో కలవదు గనుక అరక్క అన్నపదంతో కలుపుకొని అర్థం చెప్పుకోవాలి. చూసి, మేం ఆపుకుందామన్నా ఆగక కారిపోతున్న కన్నీళ్ళని గమనించు అని అర్థం చెప్పుకోవాలి. అలమరలావతు అంటే భయపడటం, దుఃఖపడటం అని అర్థఆన్ని చెప్పుకుంటే ప్రతిపదార్థంలో నోక్కి అన్నపదానికి అలమరుకిన్ఱ అన్నపదంతో అన్వయం చెప్పి దానికి తగినట్లుగా నిల్లాక్కణ్ణనీర్‌కళ్ - ఆగని కన్నీళ్ళు అన్నదానికి ఆగని కన్నీళ్ళుగల స్త్రీలు అని అర్థం చెప్పుకోవాలి. ఎలా అయినా భావం మారదు. కురఙ్గు+అరశు= కురక్కరశు అని సంధి అవుతుంది. 4

అవతారిక: ఘటకులవంశంలో కాని ముముక్షువుల వంశంలోకాని పుట్టినదొకామె ఉన్నట్టుంది. సర్వేశ్వరుడి విషయం బాగా తెలిసినదై, గజేంద్రుడు ఆపదలో ఉన్నప్పుడు సర్వేశ్వరుడు తన పరత్వాన్ని కూడా లెక్కచెయ్యకుండా ఆ గజేంద్రుడు చిక్కుపడిన చెరువుకి గాభరా పడుతూ వచ్చి దానికి కలిగిన ఆపదనుంచి దాన్ని రక్షించి, ఆ తరువాతకూడా వెంటనే వచ్చి దాన్ని ఆపదనుంచి కాపాడలేకపోయేను బాధపడినతరువాత వచ్చేను దీనికి ఎంతబాధకలిగిందో అని మనస్సుబాగా నొచ్చుకొనటాన్ని ఈమెకి బాగా తెలుసు. "నువ్వు పూర్వం నిన్నాశ్రయించినదాన్ని ఒక జలచరం పట్టుకొని బాధిస్తూంటే, బాధిస్తున్నది ఒక నీటిపురుగే అని వదిలేయకుండా వెంటనే వచ్చి పడ్డావే! అది జ్ఞాపకం ఉన్నదా? ఇవాళ అంతమాత్రమే కాకుండా రెండు జలచరాలు మమ్మని పట్టుకొని బాధిస్తున్నాయి. అందుచేత మా బట్టలు మాకు తెచ్చి వీటి బారినుంచి విడిపించు" అంటూ చెప్తోంది.

*మూ. కాలైక్కతువిడుకిన్ఱ కయలొడు వాళై విరవి*
*వేలైప్పిడి త్తెన్నైమార్‌కళోట్టి లెన్న విళైయాట్టో*
*కోలచ్చిఱ్ఱాడై పలవుమ్ కొణ్డు నీ యేఱియిరాతే*
*కోలఙ్గరియపిరానే కురున్దిడైక్కూఱై పణియాయ్* *5*

మూడవ తిరుమొళి

ప్రతిపదార్థము: కరియ= నల్లని కోలమ్= తిరుమేనిగల పిరానే= ఉపకారకుడా! కయలొడు వాళై= కయలనేవీ, వాళై అనేచేపలు విరవి= కలసిపోయి ఒక్కటిగా కాలై= మాకాళ్ళనుకతువిడుకిన్ఱ= గట్టిగా కరుస్తున్నాయి. ఎన్నైమార్కళ్= మా తండ్రులు వేలై= బల్లెములనుపిడిత్తు= పట్టుకొని ఓట్టిల్= నీవెనుకబడి తరిమినచో ఎన్న విళైయాట్టో= ఎలాంటి ఆట అవుతుందో నీ= నీవు కోలమ్= అందమైన చిఱ్ఱాడై పలవుమ్= అనేకవిధములైన బట్టలనుకూడ కొణ్డు= అపహరించి ఏఱియిరాతే= నచెట్టెక్కి కూర్చుని ఉండకుండా కురున్దిడై= కురుందివృక్షంమీదున్న కూఱై= బట్టలను పణియాయ్= మాకు ప్రసాదించి కరుణించు.

వ్యాఖ్యానం- (అయిదవ పాశురం)(కాలై ఇత్యాది) గట్టెక్కి చేతులు జోడించి అడిగితే బట్టలను ఇస్తానని చెప్పి నువ్వు మా సఖులతో అంజలిచేసినా తృప్తి చెందక పచ్చని ఆకులు దట్టంగా ఉన్న ఈ చెట్టుమీద మమ్ములను ఎవరైనా చూడవచ్చు అని నల్లనివాడివై చెట్లెక్కి మోసం చేస్తున్నావు. అంచేత మేం గట్టుమీద ఉండడానికి అసహ్యామై మళ్ళీ మొలలోతుదాకా నీళ్ళలో నిలబడి ఉన్నాం. అందుచేత నీ ఆజ్ఞకి బద్ధులైనట్లు వాళైచేపలు, కయలుచేపలు మాకాళ్ళని గట్టిగా కరుస్తున్నాయి. కయలుచేపలు, వాళైచేపలు ఇవి రెండూ కలిసిపోయి కాళ్ళని కరుస్తున్నాయి. ఒకటి బాధించటం ఆ పాట్లు నీకు తెలుసు. కాని ఇప్పుడు రెండుగదా బాధిస్తున్నవి. అతన్ద్రితచమూపతిప్రహితహస్తమస్వీకృత ప్రణీతమణిపాదుకమ్ అని ఆనాడు "నన్ను ఆశ్రయించినవాడి కాలు బాధపెడుతూంటే చేతులెత్తి మొరపెడుతున్నాడు. ఇప్పుడు కాళ్ళూ చేతులూ కూడగట్టుకొని వెళతానంటే ఆలస్యమైపోదా'' అంటూ సేనాపతిముదలియారిచెయ్యి విదల్చుకొని పాదరక్షలైనా తొడుక్కోకుండా పరుగులు పెట్టిన నీ పాట్లు జ్ఞాపకం ఉన్నాయా? "కానమర్ వేళ్ళమ్ కైయెదుత్తలఱ క్కరావతన్ కాలినైక్కతువ ఆనైయిన్ తుయరమ్ తీర పుళ్ళూర్న్దు శెన్ఱు నిన్ఱాళితొట్టు" రక్షించేవు. ఇప్పుడు రెండునీటిజంతువులుబాధిస్తున్నాయి. నువ్వు వచ్చి రక్షించవా" అంటే, అప్పుడు పైవాల్ళు బాధించటంవల్ల నేను వెళ్ళి రక్షించవలసివచ్చింది. ఇక్కడ మిమ్ములని పైవాళ్ళెవరూ బాధించటం లేదకదా! అంచేత మీరే రక్షించుకోవచ్చు, దీనికి నేనెందుకు" అన్నాడు. అంతేకాదు కొన్ని శృంగారచేష్టలుకూడా చెయ్యటం

మొదలుపెట్టేడు. "ఇది నీకు ఒక ఆటలా కనబడుతోంది. స్నానానికి వచ్చిన మేం తొందరగా తిరిగి రాకపోవటంవల్ల ఏమైందో అని అనుమానించే మాతండ్రులు చేతుల్లో బల్లేలని పట్టుకొని ఇంక వస్తారు. అప్పుడు బట్టలని దొంగతనం చేసిన నల్లనివాడివి నిన్ను చూసి నీ వెనకపడి పట్టుకోవటం తప్పదు. అదికూడా ఆటేనా? ఎలాంటి ఆట అవుతుందది? ఏమి కృష్ణా! అది ఆటే అవుతుందా? నువ్వు అవమానించబడాలా? ఇప్పుడు నీ చేతిలో మేం పడుతున్న పాట్లు అప్పుడు నువ్వు వాళ్ళచేతిలో పడాల్సి వస్తుంది." అన్నారు. "అంతేనా, అలాంటి పాట్లు పడే స్థితి నాకు వస్తుందో రాదో! అందుకు భయపడి ఇప్పుడు చేతికందినవాటిని ఎందుకు ఇవ్వాలి?" అంటూ ఒక బట్టని మొలకి కట్టుకొని, తలకి ఒకటి కట్టుకొని మరొకదాన్ని ఉత్తరీయంగా వేసుకోవటం ఇలా రంగురంగుల బట్టలని అలంకరించుకొని మిగతావాటిని మళ్ళీ కురున్తిచెట్టుమీదే పెట్టేశాడు." చూసేరా ఇవి నాకెంతబాగా సరిపోయినాయో! ఇలా నన్ను చూసినతరువాత నాతో కలిసి ఆడుకోవాలనిపించలేదా మీకు?" అన్నాడు. " నువ్వు ఒకదానికోసం ఎన్నో బట్టలని పట్టుకున్నావే! నీ బట్టలు కూడా నువ్వు ఎందుకు దొంగతనం చెయ్యకూడదు? మగవాడివైన నీకే అది సహించరానిదైతేఒక్కబట్టకూడా లేకుండా ఆడపిల్లలమైన మేం ఎలా ఉంటాం? "మీరు అడ్డుకున్నప్పుడు మీ బట్టలని వేసుకొని మిమ్ములను కౌగలించుకున్నట్లుగా ఆనందిస్తున్నా"నంటావా? చాలా అందంగా ఉన్నావు కాని, అప్పుడు మా బట్టల నెన్నింటినో నువ్వు కట్టుకొని మిగతా బట్టలని చెట్టుమీద ఊరికనే ఉంచటం ఎందుకు మాకిచ్చేయి. మేం వాటిని ముక్కలు చేసి అందరం కట్టుకుంటాం. నిజంగా నువ్వు కట్టుకున్న బట్టలని కూడా ఇచ్చేస్తే నువ్వు కట్టి విప్పిన బట్టలు కట్టుకున్నందువల్ల మాప్రాణాలు నిలుస్తాయి. బట్టలతో కప్పబడకుండా నీ నల్లని తిరుమేనికూడా మేం సేవించగలిగేటట్లు ఉంటుంది. నువ్వు మేం చెప్పినదానికి ఒప్పుకో" అన్నారు.

కతివిడుకిన్ఱ – కతువు అన్న క్రియతో ఇదు అనే సహాయకక్రియకూడా చేరిఉన్నది. కతువుకిన్ఱన. 'అ' అనే బహువచనం వికృతి చెంది ఇలా వచ్చింది.

వేలైప్పిడిత్తు – వాళ్ళు వాళ్ళు తమతమ బల్లేలు పట్టుకొని. లేదా, 'నిన్ కైయిల్ వేల్ పోఱ్ఱి' అని ఒకసారి మేము చెప్పిన నీ బల్లేన్ని వాళ్ళ చేత్తో పట్టుకొని అని అర్థం చెప్పవచ్చును. ఎన్నై అనేపదం ఒకే పదం. మా తండ్రి అని అర్థం. ఎన్

ఐమార్ అని కుడా విడదీసి చెప్తారు. ఇక్కడ ఎమ్ ఐమార్ అని బహువచనం అప్పుడు ఉండాలి. చిఱ్ఱాడై అని కృష్ణుడి వస్త్రాన్ని చెప్పడం కూడా ఉన్నది. "చిఱ్ఱాడైయుమ్ చిఱుప్పత్తిరముమ్) అని పెరియాళ్వారుల తి.మొ. 3-3-5 లో ప్రయోగం గమనించతగినది. 5

మూ. తడత్తవిళ్ఙ్త్తామరైపొయ్కై త్తాళ్కళెజ్గాలైక్కతువ
విడత్తేళెఱిన్దాలేపోల వేతనైయాఱ్ఱవుమ్ పట్టోమ్
కుడత్తైయెడుత్తేఱవిట్టు క్కూత్తాడవల్లవెఙ్గోవే
పడిఱ్ఱై యెల్లామ్ తవిర్న్దు ఎజ్గళ్ పట్టైప్పణిత్తరుళాయే. 6

ప్రతిపదార్థము: కుడత్తై= ఎన్నో కుండలను ఎడుత్తు= తలమీదను,చేతులమీదను, భుజములమీదను ఏఱవిట్టు= ఆకాశమున ఎగురునట్లు కొన్నింటిని ఎగురవేసి కూత్తాడ= కుంభనృత్యముచేయుటకు వల్ల= సమర్థుడవైన ఎమ్= మా కోవే= స్వామీ! తడత్తు= ఒడ్డువరకును అవిళ్ఙ్= విరిసియున్న తామరై= తామరమొగ్గలున్న పొయ్కై= చెరువులోని తాళ్కళ్= తామరతూడులు ఎమ్ కాలై= మాకాళ్ళను కతువ = పట్టుకొనుటచే విడమ్ తేళ్= విషపుతేళ్ళు ఎఱిన్దాల్ పోల= కుట్టినట్లు ఆఱ్ఱ ఉమ్= పూర్తిగా వేతనై పట్టోమ్= అబాధపడుచున్నాము పడిఱ్ఱై= వంచనను ఎల్లామ్= పూర్తిగా తవిర్న్దు= వదలి ఎజ్గళ్ పట్టై= మా వస్త్రములను పణిత్తు అరుళాయే= ఇచ్చి ఉపకరించవలెను.

వ్యాఖ్యానము: (ఆరవ పాశురం) (తడత్తవిళ్ఙిత్యాది) చెరువులో ఉన్న చేపలు బాధిస్తున్నాయి" అంటే దిగాలుమన్నట్లు "తామరలచెరువులో తామరతూళ్ళుకూడా బాధిస్తున్నాయి అంటే కాస్త వెనక్కి తగ్గుతాడేమో అని భావించి అంటున్నారు. "చేపలు ఉందుగాక! తామరమొగ్గలు చెరువుగట్టువరకును వికసించి విస్తరించి యుండటంచేత వాటి కాడలు అంతటను కాళ్ళకు ముళ్ళకంపలవలె చుట్టుకొంటున్నాయి. అప్పుడు విషపుతేళ్ళు కుట్టినట్లు బాధ కలుగుతోంది." అంటే "అయితే గట్టుమీదికి వచ్చి నిలవండి" అన్నాడు. (తడత్తవిళ్ఙ్ త్తామరై పొయ్కై) గట్టుమీదనేకదా తామర లేనిది! తడమ్ అంటే పెద్దది - అంటే పెద్ద చెరువు అన్నమాట. "స్నానం చేసేటప్పుడు

మాత్రం నిలుచుంటామంటే జాగా చాలదు అంటున్నారు. నేనేమి చేసేది? గట్టెక్కిపోండి" అన్నాడు. (వేతనైయాఱ్ఱ్రవుమ్ పట్టోమ్) నిన్ను చాలాకాలంగా వదిలి ఉండటంచేతనూ, నీటిలోనున్న చేపలవల్లనూ మేం చాలా బాధపడుతున్నాం అన్నారు. "మీరు నీళ్ళలో దిగినదగ్గరినుండీ నేనుకూడా చెట్టుమీదనే ఉన్నాను. ఈ చెట్టుమీద ఏమేమి ఉన్నాయో వాటికి అంతు లేదు. నేనుకూడా వీటివల్ల పడుతున్న బాధకి అంతటంటూ లేనే లేదు" అన్నాడు. "మీలాగే నేనూ పడుతున్నాను" అన్నాడు. కాలదైర్ఘ్యం ఆయనకీ వీళ్ళకీ ఒకటే అయినా వీళ్ళకి అలా అనిపించటం లేదంటారు పెరియవాచ్చాన్పిళ్ళై. అతనికేమీ అక్కరలేదుకదా! అయితే వీళ్ళనెందుకు కావాలనుకుంటున్నాడు? అంటే - వీళ్ళులేకుండా ఆయనకి గడవదు. ఆయనకి మరేమీ అక్కర్లేదంటూ వీళ్ళు కావాలనుకోవటం ఎట్లా కుదురుతుంది? అంటే. ఆశ్రితులవిషయంలో సాపేక్షత్వం ఆయన నిరపేక్షత్వానికి భంగం కాదుగదా! ఏమిటి దీనికి దృష్టాంతం అంటే, అన్తఃపురానికి కిందనించోవటం అంటే పట్టాభిషిక్తుడికి అదేమీ తక్కువ కాదు కదా! "ఆ వేదన ఎవళ్ళవల్ల? మేం బట్టలని పట్టుకుపోయి కురున్దిచెట్టెక్కి కూచున్నామా? అది నీవల్లే కదా వచ్చింది" అన్నారు. "ఆ బాధ నావల్ల వచ్చినా, మీఅందరూ గాభరా పడుతూంటే చూసేంగదా!" అన్నాడు. "అదే నీకు ఇలా అందరినీ ఒకచోట చేర్చటం కావాలా? ఆడపిల్లలని ఒకచోటచేరేటట్లు చూడాలనుకుంటే, నాలుగువీధులకూడలిలో కుంభనృత్యం చేసి సిగ్గులేకుండా ఆడపిల్లలనందరినీ ఒకచోటికి కూడగట్టేవాడివి కదా నువ్వు" అన్నారు.

"కురున్దివృక్షంమీద బట్టలెన్నో మూటలుగా కట్టి కుండలలాగ చేసి మూటమీద మూటగా తలమీదకొన్నింటిని వేసుకొని, భుజాలమీద, చేతులలోను కొన్నింటిని పట్టుకొని నాలుగువీధుల కూడలిలో కుంభనృత్యం చేస్తున్నట్లు కొమ్మలలో గెంతుతున్నావు." (పడిత్తై యెల్లామ్ తవిర్న్దు) నువ్వు చేస్తున్న మాయలన్నింటినీ చెయ్యకు." అన్నారు. "సరే అక్కర్లేదనుకుంటే తీసుకుపొండి" అని తనబట్ట ఇవ్వటానికి చూసేడు.(ఎజ్గళ్ పట్టై ప్పణిత్తరుళాయే) "మేం వీటిని సట్టుకు వెళితే, మా పెద్దవాళ్ళు ఈ బట్టలు మీకెలా వచ్చేయి అని అడగరా? అంచేత మా బట్టలు మాకియ్యి. ఇట్లా ఏమాత్రం వంచించకుండా వస్త్రాలని ఇచ్చి కటాక్షించు" అంటున్నారు.

తడత్తవిళ్ఘ్ అన్నప్పుడు అత్తు అనేదాన్ని ఉపేక్షించి తడమ్ - విశాలమైన సరస్సు

అని అర్థం చెప్తారు.

విడత్తేళ్ – సముద్రపుటొడ్డున బొరియలలో ఉండే తేళ్ళ(ఎండ్రపీతల)కి విషం ఉండదు. అలా కాకుండా వీటికి విషం ఉన్నదిసుమా అని సూచించటానికి విడమ్ అని ప్రయోగించబడింది.

ఆగ్ర్రావుమ్ పట్టోమ్ – తేలు కుట్టటం అంటూ ఒకటి లేకపోయినా ఒంటికంతటికీ బాధకలుగుతోంది. అలాగ అన్నమాట. పడుకిన్టోమ్ అనకుండా పట్టోమ్ అని అనటం కృష్ణుడినీ, అతని ఆటనీ చూసి చెప్పేటప్పుడు వీళ్ళకి ఆ అనుభవంలో వేదన పోయినట్లుండటాన్ని సూచించటం జరిగింది. కావలసినది లభించిందన్నమాట. ఇంతవరకూ అనుభవించి తృప్తిని పొంది ఇక ఇవ్వవచ్చుకదా అని అంటున్నారని కూడా అర్థం చెప్పవచ్చును.

పడిఱు వఞ్జకమ్ – అల్లరి అని కూడా చెప్తున్నారన్నమాట.

ఎజ్గళ్ పట్టై – ద్రౌపదికి అంతులేని వస్త్రాలని సంకల్పమాత్రంచేత సృష్టించిననువ్వు ఎన్నెన్నో వస్త్రాలని ఇవ్వవచ్చును. మాకు కావలసినవి మా పాతవస్త్రాలే. మరోబట్టలను కట్టుకొని వెళితే "ఇది ఎక్కడిది" అని మమ్ములను మాఇంట్లో అడగరా? మేం ఏమి చెప్తాం? అని భావం. 6

మూ. నీరిలేనిన్ఱయర్క్కిన్టోమ్ నీతియల్లాతనశెయ్తాయ్
ఊరకమ్ శాలవుమ్ శేయ్త్తాలూళ్ళియెల్లామ్ఉణర్వానే
ఆర్వమునక్కేయుడైయోమమ్మనైమార్ కాణిలొట్టార్
పోరవిడాయ్ ఎజ్గళ్ పట్టై ప్పూజ్గురున్దేఱియిరాతే. 7

ప్రతిపదార్థం: *ఊళ్ళి*= ప్రళయకాలములు *ఎల్లామ్*= అన్నింటియందును *ఉణర్వానే*= అంతయును తెలసియున్నవాడా! *నీతి అల్లాతన*= నీవు అన్యాయములను *శెయ్తాయ్*= చేసియున్నావు. *నీరిలేనిన్ఱు*= (మేము) నీటిలో నిలచినవారం అట్లే ఉండి *అయర్క్కిన్టోమ్*= బాధపడుచున్నాము *ఊర్ అకమ్*= నందవ్రజమును, మా ఇళ్ళను *శాల ఉమ్*= చాల *శేయ్త్తు*= దూరమున ఉన్నవి *ఆల్*= విరుత్తము *ఉనక్కే*= నీ విషయముననే *ఆర్వమ్*= ఆశ *ఉడైయోమ్*= గలవారిమై యున్నాము *కాణిల్*= ఇట్టి స్థితిని చూసినచో, *అమ్మనైమార్*= మా తల్లిదండ్రులు *ఒట్టార్*=

మమ్ములను అనుమతించరుకదా! *ఎజ్గళ్ పట్టై*= మా పట్టువస్త్రములను *పోర*= మావద్దకు చేరునట్లు *విడాయ్*= విడువుము *పూ కురున్దు*= పూవులతోనిండియున్న కురున్దవృక్షమున *ఏఱి ఇరాతే*= ఎక్కి కూర్చొనవద్దు.

వ్యాఖ్యానము: కృష్ణా! కోడికూయకముందే తెల్లవారకముందు నీకు తెలియకముందే వచ్చి నీళ్ళలో మునుగుదామని ప్రయత్నించేం. నువ్వు ఊళ్ళో నిద్రపోతున్నావు, ఇక్కడికి రాలేవు అని అనుకున్నాం. దానివల్ల తెలివికాస్తా కలతచెంది మేం పడుతున్న పాట్లు చూడు. "మీరు నీళ్ళలో ఉండి తెలివిచెడ్డవాళ్ళైతే, నేను చెట్టుమీద ఉండి బాధపడుతున్నదా చాలదా? ఇదంతా మీరు చేసినదే" అంటూ కొన్ని సరసాలాడేడు.(నీతియిత్యాది) "ఏమయ్యా, ఇట్లా వరుసా, వావీ లేకుండా మాటాడుతున్నావు" అన్నారు. "ఇక చేసి ఏం లాభం? ఏదో చేస్తే చేసేను, నా ఇష్టం. నన్ను అడ్డుకొనేవాళ్ళెవరు? ఇక మీరు పడ్డకష్టాలన్నీ ఊళ్ళో చెప్పకుండా ఉంటారా?" అన్నాడు. ఊళ్ళోకి వెళ్ళటం ఎట్లాగ? చాలా దూరంగదా! ఒకవేళ ఏదో కష్టపడి ఊరిదాకా వెళ్ళినా, మా ఇళ్ళు ఆ చివరనకదా?" అన్నారు. "నేను బాధపెడుతూంటే, ఊరూ, ఇళ్ళూ చాలా దూరమైతే, ఇక ఇంటికి వెళ్ళాలని ఎందుకు అనుకుంటున్నారు?" అన్నాడు. (ఊழி యెల్లాముణర్వానే) "మరొకరివల్లకలిగిన బాధ, తమంతట తామే కలిపించుకున్నబాధ అనే తేడా లేకుండా అన్నింటినీ నీవల్లనే పోగొట్టుకొన్నట్లుగా, నువ్వు కల్పించిన బాధనికూడా పోగొట్టుకోవటానికి మార్గం నువ్వే చెప్పాలికదా! నువ్వు తప్ప, వేరెవ్వరూ లేని ప్రళయకాలాల్లోకూడా నిద్రించకుండా వాటిరక్షణచింతలో మునిగిఉన్నావని ఇప్పుడే జ్ఞాపకానికి వచ్చింది. సదేవ అని నువ్వుమాత్రమే ఉన్న అప్పుడు "బహుస్యామ్" అని సంకల్పించిన నువ్వు, ఇప్పుడు మేం పడే పాట్లని చూడలేవా? అన్ని ప్రళయాలనీ తెలిసినవాడా! ప్రళయకాలంలో మహాసముద్రంలో పండుకొనిఉండే నీకు, నీళ్ళలో నిలబడి ఉండటంలో ఉన్న కష్టం బాగా తెలిసిఉన్నదే.

అందుచేతనే కదా నీటిలో పడకుండా మర్రియాకుమీద పండుకోవటం, అన్ని జీవరాసులూ అప్పుడు మునిగిపోకుండా నీ కడుపులో దాచుకొని రక్షించటమున్నూ! ఇలా అన్నీ తెలిసిన నువ్వు మేం నీటిలోంచి గట్టెక్కలేకుండా ఇంత అన్యాయం

చెయ్యవచ్చా? అయితే, చీకటిలోనే బయలుదేరి ఇళ్ళకి చేరి వేరుబట్టలని కట్టుకొనండి అంటున్నావా? అది కుదరదే! ఊరు చాలా దూరంగా ఉన్నది. అంతేకాదు ఇళ్ళని చేరటం అసలే సాధ్యం కాదు. "మీరు నాకు అనుకూలంగా లేనప్పుడు నేనుమాత్రం మీకు అనుకూలంగా ఉండాలా?" అని అనుకోవద్దు. ఏవిధంగాచూసినా నువ్వంటే మాకు విపరీతమైన ఇష్టం ఉన్నది."నేను చెప్పినట్లు నడిస్తే అది మంచిదారే కదా! లోకంలో ఉన్నవాళ్ళు అలా చెయ్యటానికి అడ్డేమీ లేదు. కాని మీరు అలా చెయ్యరు కదా!" "మాకు అడ్డు లేకపోవటమే కాదు, (ఆర్వమునక్కే యుడైయోమ్) మాకు కూడా అట్లా చెయ్యటానికి ఏమీ ఆటంకం లేదే! నీకది తెలియదేమో!" అన్నారు. "నాకేం తెలుసు అందరూ కలిసి నేను చెప్పినట్టే చేద్దాం అనిఅనుకున్న విషయం? లేకపోతే, అనుకోనివే చక్కగా జరుగుతూంటే, నీమీదే మాకు ఆశ, అని అంటే సరిపోతుందా? అలా చెయ్యాలి కదా?" అన్నాడు. " మాకు అలా చెయ్యాలనే ఉన్నది. బట్టలుకట్టుకోకుండా ఇలాగే నాకు కనబడండి అంటావా? తెల్లవారి పోయింది. ఈస్థితిలో (అమ్మనైమార్ కాణిలొట్టార్) మా పెద్దవాళ్ళు చూస్తే దగ్గరకి రానీయరే. నీళ్ళలో ఉన్న మేం ఈ మడుగులోనే మునిగిపోయి నశించిపోవటమే అవుతుంది. మాబట్టలని నువ్వియ్యాలని ఎదురు చూస్తున్నాం" అన్నారు."నేనూ, మీరూ పట్టు బట్టలు కట్టుకొని సరదాగా మీ ఇళ్ళకి వెళ్ళి ఆడుకోవాలనికదా ఉన్నది. కాని ఏంచేస్తాం, పట్టుబట్టలని ఇవ్వటానికి నా మనస్సు ఒప్పుకోవటం లేదే. దాన్ని ఒప్పించి ఇవ్వాలి" అన్నాడు. "నీమనస్సుకిష్టం లేకపోయినా నువ్విచ్చేస్తే చాలు మాకు" అన్నారు."సరే! అయితే తీసుకోండి" అని బట్టలని చెట్టుమీద వీళ్ళకి అందీ అందనట్లు పెట్టి, "నేను పోతున్నాను, మీరే చెట్టుమీదున్నబట్టలని తీసుకోండి" అన్నాడు. "అలా అనకు. మేం గట్టుమీదికి రావటం కుదరదుగదా చెట్టెక్కటం ఎక్కడ కుదురుతుంది? (పోరవిడాయ్) కృష్ణా! నువ్వే వాటిని మాదగ్గరకి తెచ్చి ఇయ్యి. ఇస్తూ ఇస్తూ వాటిని నీళ్ళలో పడేలాగ విసిరి వేయకు. అంతేకాదు. మాబట్టలని, నీ బట్టలతో కలిపేసేవుకనుక ఏవేవో తెలియకుండా నీ బట్టలు మామీద పడేయకు. వాటిని కట్టుకొని ఇంటికి వెళితే మా తల్లులు చూస్తే వదలరు. ఎవళ్ళబట్టలు వాళ్ళకే అందేటట్లు ఇయ్యి. నీకు ఈబట్ట ఫలానివాళ్ళది అని అనుభవంవల్ల తెలుసుకదా! (పూజ్గురుద్ది ఏటియిరాతే) ముఖం తిప్పుకొని పువ్వులమీద

ఆసక్తిగలవాడిలా వాటివేపు చూస్తూ కుర్చున్నాడు."ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది. నువ్వు పువ్వులకోసం చెట్టెక్కి కూర్చోకుండా దిగివచ్చి మాబట్టలని మాకుఇయ్యాలి. ఇంకా నువ్వు చెట్టుమీదే ఉన్నట్లైతే నీవల్లనే మేం ఇంతసేపు ఆలస్యం చేస్తున్నాం అని పెద్దవాళ్ళు మమ్ములని బాధిస్తారు. కనుక నువ్వు మాకంటే ముందుగా దిగి వెళ్ళిపో. (పూఙ్గురున్దు) కురున్దపువ్వుల తేనె తాగుతూండే చీమలూ, మిగతా పురుగులూ నిన్ను బాధిస్తూంటే మామీదున్న ప్రీతిచేత దాన్ని పట్టించుకోకుండా ఉన్నావులా ఉన్నది. మేం అడ్డుకుంటే ఆ బాధ తెలుస్తుంది. అలా వద్దు. వెంటనే దిగిపో అన్నారీ చిన్నవాళ్ళు. 7

మూ. మామిమార్మక్కళేయల్లోమ్ మఱ్ఱుమిఙ్గెల్లారుమ్ పోన్దార్
తూమలర్కణ్కళ్వళర త్తొల్లైయిరాత్తుయిల్వానే
శేమమేలన్ఱితు శాలచ్చిక్కెన నామితుశొన్నోమ్
కోమళవాయర్కొழுన్దే కురున్దిడై క్కూఱైపణియాయ్. 8

ప్రతిపదార్థము: *తూ*= పరిశుద్ధమైన*మలర్*= ఎర్రతామరపువ్వువంటి*కణ్కళ్*= నేత్రాలు *వళర*= వికసించి పెద్దవిగా అయేటట్లు *తొల్లై*= పురాతనమైన *ఇరా తుయిల్వానే*= రాత్రి నిద్రించేవాడా! *ఇఙ్గు*= ఇక్కడ ఉండే (మేము) *మామిమార్మక్కళే అల్లోమ్*= అత్తకూతుళ్ళనబడే నీ భార్యలము మాత్రమే కాము *మఱ్ఱుమ్*= మిగతా *ఎల్లారుమ్*= అందరున్నూ *పోన్దార్*= వచ్చియున్నారు. *శేమమ్ ఏల్*= (మాకు) క్షేమము అంటే, *ఇతు అన్ఱు*= నువ్వు చేసే ఈ పద్ధతి కాదు *శాల*= చాలా *చిక్కెన*= నిశ్చయంగా (గట్టిగా) *నామ్*= మేము *ఇతుశొన్నోమ్*= దీనిని చెప్తున్నాము. *కోమళమ్* = అందమైన *ఆయర్కొழுన్దే*= గోపబాలుడా! *కురున్దిడై*= కురున్దిచెట్టుమీదనున్న *కూఱై*= మా వస్త్రములను*పణియాయ్*= మాకు ఇయ్యవలెను.

వ్యాఖ్యానము: (ఎనిమిదవ పాశురము) (మామిమారిత్యాది) ఇతను ఒకసారికొకసారి ఇంకా ఎక్కువగా అల్లరి పనులు చెయ్యడం మొదలుపెట్టేసరికి "ఊళ్ళో వీటిని చెయ్యకుండా ఇక్కడ ఎందుకు చేస్తున్నావంటే, ఒక్కడూ ఉన్నచోట చెయ్యటానికి ఇష్టం లేదుకదా అనే కదా! ఈవిషయాలన్నీ ఊరిలో చెప్పుకుంటారులే" అన్నారు. ఊళ్ళో చెప్పుకుంటే ఏమి? మీరే కదా ఇక్కడికి వచ్చేరు! నేనేమైనా ఇక్కడికి

మిమ్ములను అల్లరి  పెట్టటానికి రమ్మన్నానా? నేనేకదా చెడ్డవాడిని! నువ్వు చెడ్డపనులెందుకు చెయ్యాలి? అంటే, మేనత్తకొడుకు కనుక మిమ్ములని హాస్యమాడుతున్నానని నాకు చెప్పటానికి వీలే కదా!'' అన్నాడు. ''ఒక ఊరివాళ్ళమైనంతమాత్రం కనబడినవాళ్ళందరూ అత్తకూతుళ్ళే అవుతారా?'' అన్నారు. తమని స్వామికి భార్యలుగా చెప్పుకుందికి సిగ్గువేసి, అత్తలకూతుళ్ళం అంటున్నారు. సామాన్యంగా భార్య భర్తని  తన భర్తృసంబంధంతో నలుగురి ఎదుటా పిలవదు గదా! "అత్తకొడుకుగా చెప్పుకోగలిగితే అని వెనుక చెప్పినట్లుగనే ఇక్కడ నీ అత్తలకూతుళ్ళం అంటున్నారు. సంస్కృతంలోకూడా "ఆర్యపుత్ర" అనే భర్తని పిలవటం మనం చూస్తాం. మగ్ర్గుమిఙ్జెల్లారుమ్ పోన్దార్) "వాళ్ళని కన్నవాళ్ళుకూడా ఉంటారు కదా!నువ్వు అనుకున్నవాళ్ళుమాత్రమే ఇక్కడికి వచ్చినవాళ్ళు అనుకుంటున్నావేమో! నువ్వు ఎవళ్ళదగ్గర భయపడాలో వాళ్ళందరూ కూడా వచ్చేరుసుమా! అంచేత ఇక్కడ నువ్వు చేసే అల్లరి అంతా ఊళ్ళోవాళ్ళకి చేరుతుందిసుమా!" అన్నారు. మగ్ర్గుమ్ అని ఇంకా ఇతర స్త్రీలు అని చెప్పటంలో, అత్తలవంటివాళ్ళు కూడా రావటాన్ని సూచిస్తోంది. ''ఎల్లోరుమ్'' అనటంవల్ల ఎంతోమంది వచ్చి చూస్తున్నారని చెప్తున్నారన్నమాట. ఇక్కడ పెరియాళ్వార్ తమ తిరుమొళ్రి2వశతకం-10వదశకంలో "కుణ్డలమ్ తాళ్గ కుళ్గల్ తాళ్గ నాణ్ తాళ్గ ఎణ్తిశైయోరుమిఙ్జె త్తొళ్గుదేత్త- ఎనిమిది దిక్కులలోనున్న పెద్దలందరూ వస్త్రాపహరణం చేసినప్పటి ఆయన సౌందర్యాన్ని అనుభవించటానికి వచ్చి ఉన్నారే" అని సాయించటాన్ని మనం గమనించవచ్చు.

"మీరే నాకు చెప్పలేదు. నాకు తెలిసి ఉంటే నేనూ, మీరూ మాత్రమే ఉండటానికి అడ్డుగా మిగతావాళ్ళని రానిచ్చేవారా?" అన్నాడు. "నువ్వు ఇదివరకటిలాగనే ఉంటావని అనుకున్నాం ఇప్పుడు ఇలా మరొకలాగ నడుచుకుంటున్నావని మాకు తెలుసా? ఇదివరకంతా రాత్రి చాలాసేపు ఆడవాళ్ళతో అల్లరిపనులు చేసి ఆలస్యంగా నిద్రపోయేవాడివి కదా! ఇప్పుడుకూడా అట్లాగే అనుకున్నాం. కాని నువ్వు మాకంటే ముందుగా లేచి వచ్చి ఇక్కడ కూచుంటావని మేం అనుకున్నామా?" "ఇక దానితో పనేమిటి లెండి! ముందుగా వచ్చి ఉన్నానుకదా" అంటూ మరికొంత ఎక్కువగా అల్లరి పెట్టటం మొదలుపెట్టేడు.

తొళ్లైయిరా అని గడచినరాత్రులని చెప్పటంవల్ల తుయిన్టానే అని గడచిపోయిన కాలంగా చెప్పాలికదా అని శంకించనక్కర లేదు. తుయిల్వు అనే పదంమీద ఆన్ అనే విభక్తిప్రత్యయం చేరిస్తే తుయిల్వాన్ అనే పదం వస్తుంది. నిద్రిస్తున్నవాడు అని అర్థం. తొళ్లై అని ఆ తుయిల్వు అనే పదాన్నే సూచిస్తుంది. కణ్వళర అన్నపదమున్నూ, తుయిల్వాన్ అన్నపదమున్నూ సమానార్థకాలుగనుక, అర్థాతిశయాన్ని చెప్పటం కోసం ఇలా ప్రయోగించటం ఉన్నది. ప్రతిపదార్థంలో వీటికి రెండింటికీ వేరువేరు అర్థాలు చెప్పబడి ఉండడాన్ని గమనించండి. ఇందుకు తుయిల్వానే అనే పదానికి పండుకొన్నవాడా అని కొంతమంది అర్థం చెప్తారు. ఈ రెండోపాదం అర్థం ఏమిటంటే – ఇప్పుడు సూర్యోదయం అయిపోయింది. నీ నేత్రాలు మంచి ఆరోగ్యంతో ఉండాలంటే ఇదివరకు చేసిన ఆలస్యంగా పడుక్కోవటం అనే పాత అలవాటుని ఇప్పుడు నువ్వు మాదగ్గర నటిస్తున్నావు అని మాకు తెలుసు అని గోపికలు కృష్ణుడితో అంటున్నారన్నమాట. అంతే కాక, తొళ్లైయిరా అనే పదానికి తొందరలేని అని అర్థం చెప్పవచ్చును. మేం ఇంత తప్పకుండా వచ్చినప్పుడు కళ్ళు బాగా పెద్దవిగా చేసుకొని చూడవలసినంతగా తొందరలేని నిద్ర నీకెలా వచ్చింది? నువ్వు కావాలని నటిస్తున్నావని మాకు తెలియదని అనుకుంటున్నావేమో అని అంటున్నట్టు చెప్పవచ్చును.

(శేమమిత్యాది) "ఏమయ్యా! నువ్వూ మేమూ మాత్రమే ఉండేటట్లుండాలి" అని చెప్తున్నావు కాని ఇప్పుడు నువ్వు చేస్తున్న పనులు దానికి తగినట్లు లేవే, ఇక్కడితో అలాంటి ఆలోచనలు మానేయ్" అన్నారు. "ఎవళ్ళీమాటలంటున్నారు?" అన్నాడు. మేమే చెప్తున్నాం అన్నారు. శేమమేల్ అన్నపదంలో ఏల్ అన్నది పాదపూరణమే. శేమమ్ అంటే ఏమిటో అనే అర్థం చెప్పబడటానికి ఇక్కడ ఏల్ అన్నది ప్రయోగించ బడింది. శేమం అంటే ఇప్పుడున్న క్షేమం తరిగిపోకుండా ఉండటానికి రక్ష. మాకు ఎప్పుడూ మంచే జరుగుతూ ఉండాలని నీవు కోరుతూంటావని మాకు తెలుసును. కాని ఇప్పుడు నువ్వు చేస్తున్నది మాకు మంచిని కలిగించేదిగా లేదు. ఇది మమ్మలను బాధించటానికే కారణమౌతుంది అని అంటున్నారన్నమాట. సరే అయితే, ఈమాటలు దాటటానికి వీల్లేదు. తప్పకుండా పాటించాల్సిందే! మీరు కదా చెప్పేరు! " అన్నాడు. "నాకు మీమీదనున్న ప్రేమని ఇలా చూపించటానికి వస్తే మీరిలా

మాట్లాడటం తగునా?" అంటే, (శాల చిక్కెన) మేం ఇది చెప్తున్నాం అని వాళ్ళు అంటున్నారు. శాల అన్నది శేమమన్లు × మంచిది కాదు అనే పదంలో చేర్చి చెప్పటం ఉన్నది. ఈపదాన్ని చిక్కన అని కూడా అనుసంధిస్తారు. "తప్పుగా అర్థం చేసుకొనేవాళ్ళు దీనిని తప్పుగా అర్థం చేసుకొని అపనిందలు వేస్తారు. ఇదే దీనివల్లకలిగే బాధ" అన్నారు. "సరే! ఇలా పెద్దలమాటలని మీరితే నేను వెళ్ళే లోకాలకి పోతానుగదా!" అని తనదగ్గరున్నబట్టలలో తనకి నచ్చినవాటిని మొలకి చుట్టుకొని మిగతావాటిని చెట్టుమీదే పెట్టేసేడు."చూసేరా నాకివి ఎంత అందంగా సరిపోయినాయో!" అన్నాడు. "బాగుంది, వాటిని ఇచ్చేమని మేం అన్నామా? చెట్టుమీద పెటేటసినవాటిని ఇచ్చేయమనికదా మేం అంటున్నది" అన్నారు "అయితే నేను నిద్రపోకుండా మీదగ్గరకు వచ్చి వస్త్రాలని ఇచ్చి పోతున్నాను అన్నాడు కృష్ణుడు. అప్పుడు చెప్తున్నారు - కోమళవాయర్ కొళ్ళున్దే ! కురున్దిడై అని నువ్వు చెట్టుమీదున్నప్పుడు ఆచెట్టుమీది చిగుళ్ళలాగే చక్కగా ప్రకాశిస్తున్నావు. ఇంత అందమైన చిన్నపిల్లవాడివి నువ్వు ఇక్కడకి ఇంకా ఎందరో రాకుండానే నువ్వు మాదగ్గరకు రాకుండా చెట్టుమీదనుంచే బట్టలని మాకు అందచేయాలి అన్నారని భావం. 8

అవతారిక– తొమ్మిదవ పాశురం. "ఇతనికి రెండురూపాలున్నాయి. అంటే స్తుతించినవాళ్ళకి వాళ్ళపని చేసిపెడతాడు, నిందించినవాళ్ళకీ వాళ్ళపని చేస్తాడు అన్నట్లైతే ఆ నిందించటం చేసి చూద్దాం అని నిందిస్తున్నారు ఈ పాశురంలో.

మూ. కఞ్జన్వలైవైత్తవన్లు కారిరుళెల్లిల్పిళ్ళైత్తు
నెఞ్జు తుక్కఞ్జెయ్యప్పోన్దాయ్ నిన్ఱవిక్కన్నియరోమై
అఞ్జవురైప్పాళశోతైయాణాడవిట్టిట్టిరుక్కుమ్
వఞ్జకప్పేయ్చ్చిపాలుణ్డ మశుమైయిలీకూఱై తారాయ్. 9

ప్రతిపదార్థము : కఞ్జన్= కంసుడిచేత వలైవైత్త= అడ్డుకొనబడిన అన్లు= ఆ సమయములో కార్= నల్లని ఇరుళ్= చీకటితోనున్న ఎల్లిల్= రాత్రియందు పిఱైత్తు= నీవు అవతరించి (ఇప్పుడు) నిన్ఱ= నీళ్ళలో నిలుచుని ఉన్నటువంటి ఇ కన్నియరోమై= ఈ చిన్నవారిమైన మమ్ములను నెఞ్జు తుక్కమ్= మనస్సులో దుఃఖాన్ని శెయ్య=

పెంచేటట్లు పోన్దాయ్= వచ్చేవు అశోదై= యశోదాదేవికూడా అఞ్జ= నువ్వు భయపడేటట్లు ఉరైప్పాళ్= మాటాడదు ఆణ్ ఆడ= మగతనంతో తిరుగునట్లు విట్టిట్టు= అడగకుండా వదలివేసి ఇరుక్కుమ్= ఆనందంగా ఉన్నది. వఞ్జకమ్= వేషం మార్చుకొని వచ్చిన పేయ్చ్చి= పూతనయొక్క పాల్= స్తన్యాన్ని ఉణ్డ= త్రాగిన మఞ్జైయిలీ= భయములేనివాడా కూఱై తారాయ్= మా బట్టలను ఇచ్చివేయవలెను.

వ్యాఖ్యానము : (తొమ్మిదవ పాశురం)( కఞ్జన్ వలై వైత్తవన్రు) ఆయన ఉభయవిభూతులనీ నశింపచేయాలనుకున్న నాడు– సత్తగల సమస్తపదారాథలనీ నశింపచేయాలనుకున్ననాడు. ఆయన ఐశ్వర్యం నశిస్తే ఆయన సృష్టించవచ్చును. ఆయకే ఒక బాధకలిగితే ఇక మిగిలేది ఏముంటుంది? "స్తన్యం తద్విషసమ్మిశ్రం రస్యమాసీజ్జగద్గురోః – ఆవిషంతోకూడుకున్న స్తన్యం జగత్తుకే గొప్పవాడైనవానికి చాలా భోగ్యమైనదిగా అయినది" అని హరివంశంలో విష్ణుపర్వంలో (6–38) లో చెప్పబడింది. విషమే ఆయనకి ధారకమైంది, ఇక జగత్తుకే ఒక స్వామి వచ్చేదు. సామాన్యంగా విషం ప్రాణాలని తీస్తుంది, అమృతం ప్రాణాలని నిలబెడుతుంది. కాని ఈయనవిషయంలో అది పని చెయ్యలేదే! (కారిరుళ్ ఎల్లిల్ పిழைత్తు) ఆపిల్లవాడు సందేహంలేకుండా నశించిపోవాలని ప్రయత్నం చేసేడు. కాని ఆ సమయానికి కారుచీకటి రక్షకమైంది. తీసుకొని పోయేటప్పుడు మరెవరికీ తెలియకుండా తీసుకుపోగలిగేటట్లు తిరుమేనివర్ణానికి తగినట్లు కటికచీకటిరాత్రికావటం, కాచుకొని కూచున్నవాళ్ళకి గాఢనిద్రపట్టటానికి తగినట్లుండటం ఈ రెండూ కుదిరేయి. "వీఙ్గిరుళ్వాయ్ పూణ్డన్రెన్నై పులమ్బుపోప్పే అజ్గోరాయ్క్కులమ్ పుక్కతుమ్ – గాఢమైన రాత్రిఅయిన ఆనాడు నన్ను తీసుకొని పోయి అక్కడ ఒక గోపాలకుల ఇంట్లో ప్రవేశించటం" అని తిరువాయ్మొలో (6–4–5) అని చెప్పినట్లే. దీనికి పిళ్ళైయురఙ్గావిల్లిదాసరువారు "ఈయన వయస్సు రాకపోవటంవల్ల తనని రక్షించుకొనలేకపోయినాడు. పైగా తనకిపైవాళ్ళెవరూ రక్షించేవాళ్ళు లేరు., కంసుదు మొదలైనవాళ్ళు తప్పకుండా పట్టుకుందామని ఎదురుచూస్తున్నారు. అలాంటప్పుడు ఉపకరించింది చీకటిరాత్రి. దాన్నే రక్షించుకోవటానికి ఆశ్రయించేదు" అని దీనికి అర్థం చెప్పేరు. దాన్నిబట్టే ఈచీకటికి ఇప్పుడు భయపడుతున్నారు. వసుదేవుడినీ,

దేవకీదేవినీ తాను అవతరించినప్పుడు వదిలి వెళ్లిపోవటంతో పడిన బాధమాత్రమే కాకుండా దేవకీదేవిని తప్ప మిగతా ఆడవాళ్ళనందరినీ బాధిస్తున్నావయ్యా. కంసుడు పెట్టేబాధలకి లొంగక తప్పించుకోవటం ఆడపుట్టుక పుట్టినవాళ్లనందరినీ రక్షించటానికి ఉపకరిస్తుందని అనుకున్నాం. కాని అది మమ్మలని బాధించటానికి ఉపకరిస్తోందే!" చాలాకాలం చెరసాలలో నీ తల్లితండ్రులను కంసుడు ఉంచినపుడు అక్కడ పుట్టిన నువ్వు అక్కడే నశించి ఉండేవాడివి. ఏదో మాభాగ్యంవల్ల ఆరాత్రి చీకటి నిన్ను రక్షించింది. లేకపోతే, నువ్వు అక్కడినుండి బయటపడేటప్పుడు ప్రాణాలు పోయేటట్లుండెను. నల్లని చీకటిగనుక, నువ్వున్నూ నల్లగా ఉండటంవల్ల వాళ్ళ మనస్సుకూడా ఏమీ తెలియకుండా నిద్రపోవటంవల్ల ఆవిధంగానే యశోద ఇల్లుకూడా ఉండడంవల్ల నువ్వు బతికేవు. ఇట్లా మేం ఆనందంగా ఉండటానికి బదులుగా నువ్వు చేసే అల్లరిపనులు మమ్మలని బాధిస్తున్నాయి. కన్నెపిల్లలమైన మమ్మలని బట్టలు లేకుండా నిలబెట్టి మనస్సులని బాధించటానికే నువ్వు వచ్చావా అని అనుకోవలసివస్తోంది. ఈదుఃఖాన్ని బయట చెప్పుకుంటే సిగ్గుచేటు అని మేం మనస్సులోనే ఉంచుకొనవలసి రావటంవల్ల మామనస్సులు దుఃఖించటమే జరుగుతోంది. ఇక నీచేత బాధించబడుతున్న మా బాధలని ఏకాంతంగా యశోద దగ్గరకి వెళ్ళి మొఱపెట్టుకుంటే, ఆడపుట్టుక పుట్టిన ఆమె ఈ బాధలని అర్థం చేసికొని మామీద జాలి చూపిస్తుందని ఆమెతో చెప్పితే, "అలాంటి అల్లరిపనులు చేసి గొల్లపిల్లలని మంచిపిల్లలు బాధపెడతారా? అన్నట్టుగా చిన్నితండ్రీ! గోపబాలికలని అల్లరి పెట్టవచ్చా?" అంటూ మాటవాసికి ఒక మాట చెప్పి ఊరుకుంటుందేగాని గట్టిగా కోపంచూపించి ఆమె నిన్ను భయపెట్టటం లేదు. మేంవెళ్ళి చెప్పినా ఆమె నిన్ను ఎందుకలా చేస్తున్నావని అడగకపోతే నీ ఆగడాలు ఇంకా ఎక్కువైపోతాయి. రాక్షసి పూతనదగ్గర పాలుతాగి ఆమెనే చంపిన నీ బలం తల్చుకుంటే యశోదాదేవి భయపడకుండా ఉండగలదా? ఏదైనా చెప్పటానికి ఆమె ముందుకు వస్తుందా? ఇలా ఉన్నప్పుడు మేం ఎవళ్ళతో ఏమి చెప్పగలం? శత్రువులతో చెప్పటమా? మిత్రులతోనా? కంసుడికి చెప్తే వాడేమి చెయ్యగలడు? వాడి చెరసాలలో మీ తల్లిదండ్రులుండగా నువ్వు పుట్టినప్పుడే వాడిని నువ్వు జయించినట్లే. వాడే ఊరు కదలడు. మిత్రులతో చెప్పుదామన్నా, యశోదకంటే దగ్గరివాళ్ళెవరున్నారు?

ఆమే భయంతో ఏమీ మాటాడలేదు. అంటే, నిన్ను భయపెట్టేవిధంగా నీతోటే ఆమె మాటాడలేదు! 'అతిన్దుకొణ్డే నునక్కఞ్జువనమ్మమ్ తరవే – నిన్ను భయపెట్టటానికి జంకే తల్లని తెలుసుకున్నాను" అని చెప్పినట్లుగా తానే భయపడిపోవటంవల్ల మాటాడలేదు. పైగా మాతో ఏదో చెప్పి మాకు భయం కలిగిస్తుంది. ఏం చెయ్యటం? ఇక కంసుడిచేత పంపబడిన వాళ్ళతో చెప్పాలనుకుంటే, మొట్టమొదటే వచ్చిన పూతన పడ్డ పాట్లని తల్చుకుంటే చాలు! ఇప్పుడా నువ్వు పెద్దవాడివైనావు. ఇప్పుడు ఎవళ్ళుమాత్రం నిన్ను ఏమి చెయ్యగలరు? ఉరైప్పాళెన్బతు అన్నదానికి రెండువిధాలుగా అర్థం చెప్పవచ్చును – చెప్పదు అని ఒక అర్థం, చెప్తుంది అని రెండో అర్థం. రెండూ కుదురుతాయి.

(ఆణాడవిట్టిట్టిరుక్కుమ్) ఆణాడుతల్ అంటే మగతనం ఎక్కువగా ఉండటంచేత ఇష్టం వచ్చినట్లు తిరగటం. ఇక్కడ సంధిని విడదీసినప్పుడు విట్టిట్టిరుక్కుమ్ అనిగాని ఇట్టిట్టిరుక్కుమ్ అని గాని చెప్పవచ్చు. ఏదైనా ఒకటే అర్థం. (మశుమైయిలీ) మశుమై అంటే సిగ్గు అంటారు. దండకారణ్యంలో ప్రవేశించటంతోటే తమని రక్షించాలని మహర్షులు రాముడితో విన్నవించినప్పుడు "హ్రీరేషా హి మమాతులా" అన్నాడు రాముడు. " మా తండ్రిగారే వచ్చి మిమ్ములని రక్షించి ఉండవలసినది. నేను ముందుగానే ఈవిషయం తెలుసుకొని వచ్చి మిమ్ములని కాపాడి ఉండవలసింది. ఇప్పుడు మీరు చెప్పినతరువాత నేను కాపాడాలని అనుకున్నానే తప్ప ఇదివరకే ఇది నేను చెయ్యవలసిన కర్తవ్యం, చెయ్యలేదు అని చాలా సిగ్గుపడుతున్నాను" అని అన్నట్లుగా ఇప్పుడు నీకు మమ్ములని రక్షించలేదనికూడా సిగ్గువేస్తుందా? నీ జన్మమే వేరుగదా! అన్నమాట. లేక,నీకు కన్నతల్లిస్తనాలకీ, రాక్షసి స్తనాలకీ తేడా తెలియక కన్నతల్లి దేవకీదేవి స్తన్యాన్నివదిలి, మహాప్రీతితో పోషించే యశోదాదేవి స్తన్యాన్నికూడా వదిలి, భయంకరమైన రాక్షసితాలూకు స్తన్యాన్ని బాగా ఆశించినవాడా! పిల్లలకి కన్నతల్లుల స్తన్యాన్ని త్రాగటం సుఖంగా ఉంటుంది కదా! అలా చెయ్యలేదే అని ఇప్పుడు సిగ్గు పడుతున్నావా? ఇక ఎవళ్ళూ చెప్పవలసిన అవసరం లేకుండానే వాళ్ళంతట వాళ్ళకే అయ్యో తప్పు చేసేమే అని సిగ్గువేసి, జ్ఞానం ఉన్నవాళ్ళు దూరంగా పోవాలి. నీకు మామీదున్న మోహంతో కనబడకుండా వచ్చి చెట్టెక్కి చీకట్లో దాక్కొని మగతనం లేనివాడు చెయ్యవలసిన పని చెయ్యటం మమ్ములని అల్లరి పెట్టటం

చేస్తున్నావు. అంతమందీ చూసే ఈచోట నువ్వు చేసే పనులకి నీకే సిగ్గు రావాలికదా! నీకు సిగ్గు వెయ్యటం లేదే! అని కూడా అంటున్నారని చెప్పవచ్చును. 9

మూ. కన్నియరోడెజ్గళ్ నమ్బి కరియపిరాన్ విళైయాట్టై
పొన్నియల్ మాదజ్గళ్ శూఙ్ణ్ద పుతువైయర్కోన్ పట్టన్కోతై
ఇన్నిశైయాల్శొన్నమాలై యీరైన్దుమ్ వల్లవర్తామ్పోయ్
మన్నియమాతవనోడువైకున్దమ్పుక్కిరుప్పారే. 10

ప్రతిపదార్థము : కన్నియరోడు= గోపకన్యలతో ఎజ్గళ్= మా స్వామియును నమ్బి= కల్యాణగుణపూర్తిగలవాడును కరియ= నల్లనితిరుమేనిగలవాడునైన పిరాన్= ఉపకారకుడును అయిన శ్రీకృష్ణుడు (చేసిన) విళైయాట్టై = దివ్యములైన లీలలను గురించి పొన్ ఇయల్= బంగారముతో సమానమైన మాదజ్గళ్= మేడలచేత శూఙ్ణ్ద పుతువైయర్= చుట్టబడియున్న శ్రీవిల్లిపుత్తూరిలో నివసించువారికి కోన్= స్వామియైన పట్టన్= భట్టనాథులయొక్క (కుమార్తెయైన) కోతై= గోదాదేవినైన నేను ఇన్= మధురమైన ఇశైయాల్= రాగముతో శొన్న= చెప్పిన మాలై ఈర్ ఐన్దు ఉమ్= పది పాటలను వల్లవర్ తామ్= అభ్యసించినవారు పోయ్= ప్రకృతిమండలమును దాటి వైకున్దమ్ పుక్కు= శ్రీవైకుంఠమును ప్రవేశించి మన్నియ= అచ్చట వేంచేసి ప్రకాశించుచున్న మాతవనోడు= శ్రియఃపతితో ఇరుప్పార్= కలసియుందురు.

వ్యాఖ్యానము: (పదవ పాశురం) ఈ తిరుమొళ్ఝివల్ల చెప్పబడినదేమిటంటే – ఈయన చేసేచేష్టలనిఅల్లరిఅని తెలియకనే చెప్పినవాటిని యథార్థమని భావించటానికీ, కాలతత్త్వం ఉన్నంతకాలం అనుభవిస్తున్నప్పటికీ ఎప్పటికప్పుడే కొత్తదనంతో ఉండటానికిన్నీ, ఈయన చేసే అల్లరిపనులకి తమమనసులని పాడుచేసుకొనకుండా ఆయనకి తగినట్లుగా ఉండటాన్ని చూపటానికే ఈ గోపికలని కన్యలు అని సాయించటం జరిగింది. ఈయన చేసే అల్లరి నిజంగా బాధించటానికి చేసినదికాదని, పరమాత్మలీలలని ప్రదర్శించటమేనని గోదా దేవి భావించిందంటారు పెరియవాచ్చాన్పిళ్ళై. ఈపాశురంలో ఎజ్గళ్ అనిప్రయోగించటంతో కోతై అన్నప్పుడు

గోదాదేవినైన నేను అనే అర్థం వస్తుంది. ఎజ్గళ్ అని తన తండ్రిగారినికలుపుకొని చెప్తోందన్నమాట. ఇన్నిశైయాల్ శొన్న మాలై అని గోదాదేవి చెప్తోందంటే చక్కని భావగాంభీర్యంతోపాటు, రాగయుక్తంగా పాడటానికి కూడా తగినట్లున్నది అని చెప్తోందన్నమాట. శ్రీమద్రామాయణంలో పాఠ్యే గేయే చ మధురం ప్రమాణైస్త్రిభిరన్వితం అని చెప్పినట్లు ఈ ప్రబంధాన్ని పాడినా, చదివినా కూడా మధురంగానే ఉంటుంది అని చెప్పుతోందన్నమాట. నమ్మావారుకూడా "ఎజ్గనే శొల్లిలుమ్ ఇన్బమ్ పయక్కుమే – పాటగా పాడినా, పద్యం చదివినట్లు చదివినా, ఆనందాన్నే హాయినే కలిగిస్తుంది అని సాయించినట్లుగా అన్నమాట. ఎలా చెప్పినా వస్త్రాలని అపహరించిన కృష్ణుడిని గోపకన్యలు చేసిన ప్రార్థనలను చెప్పేటటువంటి ఈ తిరుమొళ్ళికి అప్పుడు ఆయన చేసిన దివ్యలీలలని అనుసంధించటమే ముఖ్యోద్దేశం అని భావం. గోపకన్యలున్న స్థలానికి వెళ్ళి కృష్ణుడు చేసిన లీలలని అభ్యసించినవారు ఆయన వేంచేసియుండే శ్రీవైకుంఠానికి తామే వెళ్ళి పిరాట్టిలాగనే స్వామితోకలసి నిత్యమూ ఆనందభరితులై యుండడాన్ని పొందుతారన్న మాట.

ఈ తిరుమొళ్ళివల్ల కృష్ణుడు వెళ్ళి గోపకన్యల వస్త్రాలని అపహరించటాన్ని చెప్పి చాల ప్రసిద్ధమైన ఈ ఇతిహాసంవలెనే బొమ్మరిళ్ళని పాడుచెయ్యటం కూడా జరిగిందనితెలుసుకొనండి అని చెప్తున్నారన్నమాట. ఇళ్ళల్లోనూ, నదీతీరాలనూకూడా స్వామినే కోరుకుంటూ ప్రాప్యత్వరతో ఆలస్యాన్ని సహించలేక దేవతాంతరారాధనలో ప్రవేశించిన గోపికలని స్వీకరించిన స్వామి తననికూడా అదేవిధంగా స్వీకరించి కటాక్షించేడని గోదాదేవి భావించింది. ఈవిధంగా పరమైకాంతియైన జీవుడుకూడా పరమాత్మని పొందటానికి ఆరాటపడటం చూపబడింది. తమని కానిపనులుచేసి అల్లరి పెట్టినా, నీ తిరుమేనిసౌందర్యం మమ్ములని నీకు వశపర్చుకొన్నది, నీకే దాసులమైయున్నాము నువ్వే మమ్ములను కటాక్షించాలని ప్రార్థించి తమ శేషత్వాన్ని చూపించారన్నమాట.